

గెలుపెవరిది?

కోమలాదేవి

నీలాల నింగిలో తెల్లని కొంగలు బార్లుదీరి ఎగిరిపోతున్నాయి. అలా క్రమ పద్ధతిలో ఎగరాలని, 'వి' ఆకారంలో ఎగరాలని వాటి కెలా తెలుసో! వాటి కున్న స్వల్పజ్ఞానంతో అవి ఎంత చక్కగ తమ విధిని నిర్వహిస్తాయి! వాటి కున్న జ్ఞానంలో ఆవంతైనా తనకున్నట్లు లేదు. తను ఏమైపోయింది! మాలతి అరుబైటకూర్చుని దీర్ఘంగా ఆలోచిస్తోంది. తను తప్పు చేస్తోందని తనకు తెలుసు. అంతరాత్మ హెచ్చరింపును అతిధైర్యంతో ధిక్కరించి ముందుకు సాగి పోయింది.

ఆ బాట పూలమయమై, సుగంధ సమ్మిళితమైన పిల్లతెమ్మెరలతో నిండి మనసుకెంతో ఆహ్లాదాన్ని కల్గించింది. తన జన్మ సఫలమైందని-తన కోరికలన్నీ

నెరవేరి తన జీవితం ధన్యమైందని భావించింది. ఆ మార్గంలో పయనించే కొలది ఉత్తేజితురాలై రెట్టించిన తెగింపుతో మరి వెనుదిరిగిరానని నిరాకరించింది. ఫలితం ఇది:

ఇప్పుడు విచారించి ఏంలాభం ? ఆ పూలబాటలోని ముళ్ళు చాల లోతుగా నాటుకుపోయాయి.

సాధారణమైన తలిదండ్రులకు జన్మించింది మాలతి. తండ్రి బడిపంతులు ఇద్దరు మగపిల్లలు తరువాత పుట్టటంవల్ల అతిగారాబం చేశారు. వయసొచ్చినప్పటి నించి పోరుపెడ్తూనే ఉంది పెళ్ళి – పెళ్ళి చేయమని తల్లి. మాలతి చదువు కుంటానని మొండికెత్తింది. తండ్రి బడిపంతులు – కొడుకుల్ని బి ఎ దాక చదివించి ఉద్యోగాల్లో పెట్టేశాడు. ముగ్గురూ తల్లికి వ్యతిరేకంగా నిలబడి మాలతికి బి ఎ. వరకు చదువు చెప్పించారు. ఆతర్వాత టైపింగ్, షార్ట్‌హాండ్ నేర్చుకొంది. చురుకైన పిల్ల అని పేరు గడించింది.

మాలతి పెద్ద అందగత్తె కాదు. కానీ ఆకర్షణీయమైన విగ్రహం. కన్నులు ముక్కు అమరికగా ఉండి విశాలమైన ఫాలభాగంమీదపడే ముంగురులతో ఎంతో అందంగా కనిపించేది. కాలేజీలో ఉన్నంతవరకు నిప్పులాంటి దన్న పేరు సంపాదించింది.

తండ్రిపోవటం – తల్లి పెద్దన్న దగ్గర జేరటం – చిన్నన్న ఉద్యోగరీత్యా దూరప్రాంతాలకు వెళ్ళిపోవటం – మాలతి పెళ్ళి పెద్ద సమస్యగా నిల్చి పోయింది. తీర్చలేక – ఖర్చులు భరించలేక – కట్నం యివ్వలేక అన్న మౌనం దాల్చాడు. అది గ్రహించిన మాలతి ఉద్యోగంచేయాలని సంకల్పించు కుంది. పోస్టల్ డిపార్టుమెంట్‌లో ఉద్యోగం దొరకటం తన అదృష్టమేననుకొంది. ట్రైనింగ్ పూర్తిచేసుకొని వచ్చింది. చిన్నవాటా అద్దెకు తీసుకుని విజయ వాడలో పని ప్రారంభించింది.

తాను ఉన్న ఇల్లు షుమారుగా ఉంటుంది. అన్నీ వేరు వేరుగా ఉన్నా బాత్‌రూం ఒకటే. ప్రాంగణం ఒకటే. మరొకవాటాలో వృద్ధులైనదంపతులున్నారు. ఇంకొక వాటాలో స్వంతవాళ్ళు. బాగానే వుంది అనుకుంది. మాలతి జేరిన మూడునెలలకు ఆ వృద్ధులయింటికి చుట్టం వచ్చాడు.

ఆ సాయంత్రం గుమ్మంలో నిలబడి తానుగా పలకరించాడు, "నమస్కార మండి. ఆ ఇంట్లో ఉన్నవారు మా తాత, అమ్మమ్మ. నాకీఊళ్లో ఉద్యోగమైంది. కొత్తగా వచ్చాను. ఏంతోచటం లేదు. ఏమైనా పుస్తకాలుంటే యిస్తారా?"

మాలతికి అతణ్ణి లోపలికి పిలవాలనిపించలేదు. తన దగ్గర ఏముంటాయి. రెండు పత్రికలు ఆ వారంవి తెచ్చి అందిస్తూ అంది. "నే నేమీ కొననండి. ఇవే తెచ్చుకొని చదివి మళ్ళీ ఫ్రెండ్స్‌కు యిచ్చేస్తుంటాను. వారంవారం కూడా తెచ్చుకోను." అతను అందుకొని కాసేపు తిరగేశాడు. మాలతి ఆగకుండా లోపల కెళ్ళిపోవటంతో అతడు తనవాటాలోకి వెళ్ళిపోయాడు. మాలతి పీడ విరగడైందని తలుపేసుకుంది. 'మంచిదే ప్రతివారం తెచ్చుకోనని కూడ చెప్పేశాను' అనుకొని తృప్తిచెందింది.

మరుసటిరోజు స్నానాలగది దగ్గర తారసిల్లాడు. మాలతికి అతడు పలుక రిస్తాడని తెలుసు. అందుకని అక్కడ ఉండకుండా గదిలోకి వచ్చేసింది. ఆరోజు బాగా ఆలస్యంగానే స్నానంచేసి వస్తోంటే పుస్తకాలు తిరిగి ఇచ్చేశాడు. "థాంక్స్" అన్నాడు.

మాలతి ముభావంగానే అందుకొని లోపలికి వచ్చింది. ఆ రాత్రి పడుకుని ఒక పుస్తకము తెరచింది. అలా చదువుతూ పేజీలు తిప్పుతుంది. ఒకచోట ఒక కాగితం జారి క్రింద పడింది. అది చదివిన మాలతికి కోపం వచ్చింది. అది ప్రేమలేఖ . అంతా పద్యరూపంలో ఉంది. అక్కడక్కడ కొట్టివేతలు. ఏమిటిది? ఆమెకు కోపం, అసహ్యం రెండూ వేశాయి. ఏంచెయ్యాలో తోచ చక ఛీ- అనుకొని కాగితాన్ని నాల్గు ముక్కలుచేసి మూలకు విసరికొట్టి నిద్రకుప క్రమించింది. కాని వెంటనే నిద్రపట్టలేదు. ఆ పద్యాలే మాటిమాటికి గుర్తొ స్తున్నాయి. వియోగాన్ని భరించలేక ప్రియుడు వ్రాసిన పద్యాలలోని సారాంశం ఆమె హృదయంలో కలవరాన్ని రేపింది.

తెల్లవారింది. ఈ రోజు త్వరగా స్నానం ముగించుకొని వంటకుపక్రమిం చింది. తలుపు చప్పుడైంది. తెరచి, నుంచున్న అతణ్ణిచూచి ఏమిటన్నట్లు చూసింది.

"రాత్రి కొన్ని పద్యాలు వ్రాశానండి. కాగితం కనబడలేదు. ఒకవేళ పత్రి కలో పెట్టానేమో - ఓ మారు చూస్తారా.''

మాలతి భృకుటీకరించి ఆలోచిస్తున్నట్టు నటించింది 'అదన్నమాట. ఇంకా నయం మూలగా ఆ కాగితాలు లేవు.' గబగబ లోపలికెళ్ళి పుస్తకాలుతెచ్చి తిరగే సింది. ఏమీ కాగితాలు కనబడలేదు.

"ప్రొద్దుట ఆఫీసుకు పట్టుకెళ్ళాను. అక్కడ ఎవరైనా తీశారేమో.''

''ఓమారు కనుక్కుంటారా?'' ఆత్రంతో అడిగాడు.

"గుర్తుంటే అడుగుతాను." అంటూ లోపలికొచ్చేసింది.

ఇతడొక చిన్న సైజు కవి అన్నమాట అనుకుంది. పేరేమిటో! ఏం చెప్పాలి ఏదో అబద్ధమాడాలి అనుకుంది. తాను అనుకున్నట్లు అతడు ఆమె రాగానే అడిగాడు. "నాలుగైదు చేతులు మారాయండి. ఎక్కడ జారిపోయిందో తెలీయదు'' అంది. ఇక మాటలు పొడిగిస్తాడేమో అన్న భయంతో లోపలికొచ్చేసింది.

అతడు కాసేపు తారట్లాడి వెళ్ళిపోయాడు.

మాలతి పుస్తకాలు తెచ్చుకోటం ఇవ్వటం మానేసింది కాని, కొత్తచిక్కొచ్చిపడింది. "పుస్తకాలు కావాలా అండీ-" అంటూ గుమ్మంలో పెట్టి వెళ్ళిపోతాడతను. అతని పేరు తెలిసింది. రాజేంద్రకుమార్ అని. రెండు రోజులు పోయాక అతడే వచ్చి పట్టుకెళ్తాడు. రెండు వారాలు గడిచిపోయాయి. ఈ తతంగం మాలతికి నచ్చలేదు. మెల్లగా చెప్పదల్చుకున్నది చెప్పేసింది. "నాకు పుస్తకాల పిచ్చి అంతగా లేదండీ. మా వాళ్ళ దగ్గరనించి పత్రికలు తెచ్చుకుంటాను. అవి చాలు. మీరు శ్రమతీసుకుని ప్రతిసారి నాకు యివ్వాలనుకోకండి. నాకు చదవటానికి టైం కూడా ఉండదు. ఆ టెస్ట్‌లు - ఈ టెస్ట్‌లు పాసవ్వాలని చదువుకుంటున్నాను."

"ఐతే రోజుంతా ఆఫీసులో పని, ఇంటి కొచ్చాక చదువు. మీకు డైవర్షన్ ఏమీ అవసరం లేదా!" మీరు చాల గట్టివారు అన్నట్లు చూచాడు.

"వంట-చదువే డైవర్షన్." అంది. ఇక మాటలు లేవనుకుని లోపలికెళ్ళబోయింది.

"ప్లీజ్. ఒక్క నిమిషం. మీ తెలుగు రైటింగ్ బాగుంటుందాండీ?"

"ఓ మోస్తరుగా ఉంటుంది."

"నా అక్షరాలేమీ బాగుండవు. నా పద్యాలు ఫెయిర్ చేసిపెడ్తారా?"

మాలతికి విసుగేసింది. లాభంలేదు. కుండ బ్రద్దలు కొట్టినట్లు చెప్పాలి.

"మీరేం అనుకోకండి. నాకు టైం ఉండదు. అందునా నా రాత ముత్యాల్లా ఉండవు. అదీకాక నాకు పద్యాలంటే పెద్ద యిష్టంకూడా లేదు."

'ఎంత డ్రై పర్సన్?' అనుకుని అతడు వెళ్ళిపోయాడు.

రెండు రోజులు అతడి బెడదలేదు. మూడవ రోజు రానే వచ్చింది. ఆమె కాఫీ పెట్టుకుని తాగుతోంది. రాజేంద్ర పరుగులమీద వచ్చాడు. చక్కటి టై కట్టుకున్నాడు. ఆకర్షణీయమైన భారీవిగ్రహ మతడిది. ఎక్కడికో వెళ్ళటా



నికి తయారైనట్లున్నాడు. "ఏమండీ - మా అమ్మమ్మ అదోలా ఉందండీ. ఓ మారు ఆమె దగ్గరుంటారా? డాక్టర్‌దగ్గర కెళ్తున్నాను." ఆఖరి మాటలు అంటూ అంటూనే గబగబ వెళ్ళిపోయాడు. మాలతి గొళ్ళెంపెట్టి పక్క-వాటాలోకి వెళ్ళింది. ముసలమ్మ కళ్ళుమూసుకుని పడుకుని ఉంది. ముసలాయన దగ్గర్లో స్టూలుమీద కూర్చుని ఆందోళనతో ఆమె చేతిని తన చేతుల్లో తీసుకుని ఏమీతోచక ఒత్తుతూ కూర్చున్నాడు. డాక్టర్ వచ్చి మందులిచ్చి యింజక్షన్ చేసి వెళ్ళిపోయాడు.

"తాతయ్యా డబ్బుందా? ఈ మందులు తేవాలి."

"ఇచ్చి వెళ్ళాడు కదురా" మునలాయన గుర్తుచేశాడు.

"ఈ రాత్రికి, పదిహేను పుచ్చుకున్నాడు. మందులుకొని తెచ్చిపెడితే రేపు వస్తాడట."

"అసలు మీ అమ్మమ్మ కేమైందట?"

"వృద్ధాప్యం - హార్ట్ వీక్‌గా ఉందట. బ్లడ్ ప్రెజర్ లో-అట. డబ్బివ్వు" అని చేయి చాపాడు.

"నా దగ్గర లేవురా. నీవే సర్దు."

"నా దగ్గరా లేదు. జీతం అప్పుడే రాదు. నేనిచ్చిందంతా ఖర్చుపెట్టేశారా?" కళ్ళెర్రజేశాడు. "ఇప్పుడెలా? నువ్వే ఎవ్వరైనా అడిగి తీసుకురా. నా కంతా కొత్త. నా కెవరిస్తారు?"

ఇదంతా వింటూ మాలతి కేవలం మూడవ వ్యక్తిగా మౌనంగా ఉండలేక పోయింది. తనకై తాను ఇవ్వటానికి భయపడింది. తన దగ్గర మాత్రం ఎంతుంది? ఇరవై రూపాలున్నాయేమో! ఇంకా ఫస్ట్‌కు నాల్గు రోజులున్నాయి. ఆమె మౌనంగా ఉంది. ముసలాడు అడగనే ఆడిగాడు. ఇక లేదనలేక పోయింది. పదిహేను యిస్తూ అంది "నా దగ్గర ఇవే ఉన్నాయండీ."

"ఫరవాలేదు, సమయానికి ఆదుకున్నావమ్మా" అతడు కృతజ్ఞతలు వెల్లడించాడు. రాజేంద్ర ఆ పదిహేను పట్టుకెళ్ళిపోయాడు. మాలతి తన ఇంట్లో కొచ్చింది. ఎందుకీ బెడద తనకు. అంటీఅంటనట్లుగా యిన్ని నెలలు గడిపింది. వీళ్ళూ తనలాంటి వారే. ఆర్థికంగా వెనుకబడి చాలీచాలని పెన్షన్‌తో ఈదుకొచ్చే వీరికి దూరంగా ఉంటే మంచిది. అంతరాత్మ హెచ్చరించింది కానీ ఆమె మరో విధంగా ఆలోచించింది. అతగాడికి జీతం వస్తుంది. ఇచ్చేస్తాడు.

ఆ మరుసటి రోజు ప్రొద్దుట మాలతి కాఫీనీళ్ళు పెట్టుకుని ముఖం కడుక్కోటానికి బైటికెళ్ళింది. "అమ్మాయ్ - ఆవిడకు కాఫీ కావాలంటోంది. రెండు చుక్కలు నోట్లో పోస్తాను, నువ్వు చేసుకున్నప్పుడు ఓ అరకప్పు ఆవిడకూ పెట్టిస్తావా?"

అదెంతభాగ్యం - అనుకుంది. ఇరుగు పొరుగు అన్నాక ఇలాంటి చిన్నచిన్న సాయాలు చేయక తప్పదు. కాఫీ గ్లాసునిండాపోసి పట్టుకెళ్ళి అందించింది. ఇద్దరూ చెరిసగం తాగారు. అక్కడ రాజేంద్ర లేడు. ఫరవాలేదనుకుంది. రెండు రోజులు కాఫీ - అని సర్దివేశాడు. మూడవ రోజు ఏకంగా టిఫిన్ అడిగాడు. ఉప్మా చేసిపెట్టింది. ఏ నెపంతో 'చేయను' అనగలదు? స్వంతవాళ్ళు అంతగా పట్టించుకోరు. నెలసరికి అద్దెవసూలు చేసుకుని వెళ్ళిపోతారు. పక్కగుమ్మం తడికలే అడ్డం-ఐనా వారికీ వీరికీ కొన్ని యోజనాల దూరంగా ఉన్నట్లుంటుంది. ఆమెకు చెవుడు. అతడెప్పుడు కిళ్ళీకొట్టు బెంచికి అంకితం. నాల్గు రోజులకు ముసలమ్మ కాస్త లేచి తిరుగుతోంది. మాలతి మళ్ళీ తనగదిలో ఇమిడిపోయింది. పక్కవాటాలో గొడవతో మెలకువ వచ్చింది. వినకూడదన్నా వినబడుతున్నాయి మాటలు. రాజేంద్ర కాస్త మెల్లగానే అంటున్నాడు.

"జీతం అప్పుడే రాదు తాతయ్యా. నువ్వే అద్దె సర్దు జీతం రాగానే ఇస్తాను"

"నా దగ్గ రెక్కడిదిరా?"

"పెన్షన్ వచ్చిందిగా?" భార్య గుర్తుచేసింది.

"నువ్వూరుకోవే. ఏం వందలకు వందలొస్తున్నా యనుకున్నావా? ఆరవై రూపాయలు. అంతే. మీ అమ్మమ్మ అతి తెలివైనదిరా! చిన్ననాటి నించి నిన్ను నా దగ్గర పెట్టి చిల్లిగవ్వ ఖర్చుకాకుండా నిన్ను పెంచింది. ఖర్చు, శ్రమ నాది - జీతం అనుభవించడం ఆమెది. నీ చెల్లెలుంటే ఏదో పార్టీకి నాయకురాలవవలసిన మాట. మనపాల బడింది. పిల్లలులేరని వీణ్ణి నాకంట గట్టింది! వీడేమన్నా ఉద్ధరిస్తాడంటావా? జీతం వందలకువంద లందుకుని చక్కగా తల్లికి

పంపి కూచున్నాడు రాజూ నే నివ్వను. ఈ మాటు అద్దె నువ్వేకటాలి గాక కట్టాలి." "తాతయ్యా నామాట నమ్ము. ఇంకెన్ని రోజులు పడ్తుంది. తప్పక ఇస్తాను.'' ప్రాధేయపడ్తుంటే మాలతికి జాలేసింది. మరి మాటలు వినబడలేదు. కాసేపు పక్కమీద పొర్లేసరికి తెల్లవారింది. ఆ వైపుగా వెళ్ళింది. రాంజేంద్ర బిక్కమొఖంతో బైట అరుగు మీద కూర్చున్నాడు. మాలతిని చూచి నేరస్తుడిలా చూస్తూ ఓ వెర్రినవ్వు ముఖానికి పులుముకున్నాడు. ఆమె అతణ్ణి పలుకరించలేదు. తన పనులు చేసుకొని వెళ్ళిపోయింది.

ఆ రోజంతా ఎందుకో అతని జాలిగొల్పే ముఖం ఆమె కళ్ళలో మెదుల్తూనే ఉంది.

ఆవేళ చాలా హుషారుగా వచ్చాడు. "ఏమండీ" అని తలుపుతట్టి ఈలపాట పాడుతూ నుంచున్నాడు. రాజేంద్రతో మాట్లాడి పక్షం రోజులకుపైగా అయిపోయింది. మాలతి తలుపుతీసింది. అతడు ఈల ఆపుజేసి "మిమ్మల్ని డిస్టర్బ్ చేశానేమో!" అన్నాడు. ఆతడి ముఖం సంతోషంతో తేజోవంతంగా ఉంది. "ఫరవాలేదు. ఏమిటి విశేషం?" అంది చనువుగా. "జీతం వచ్చిందండీ. అందుకే సెలబ్రేట్ చేస్తున్నాను. ఇది తీసుకోండి." ఆమె గుమ్మం అవతలనించి చేయిచాపింది. అతడు చేయి వెనక్కిలాక్కుని "మీరు ఇవతలగానైనా రండి, లేదా నన్ను అవతలగా రమ్మనండి. అంతేగాని గడపమధ్య ఉంటే నేను ఇవ్వ

లేను. అందునా మొదటి జీతం." అతడి కళ్ళలో చిలిపితనం-మాటలో చురుకు దనం ఆమెను కవ్వించాయి. లోపలికి జరిగి "రండి" అన్నది.

లోపల ఒకే ఒక కుర్చీ ఉంది. దానిమీద కూర్చున్నాడు. పదిహేను రూపా యలు బల్లమీద పెట్టి మరో చిన్నపొట్లం బల్లమీద పెట్టాడు. "అదేమిటండీ ?" అంది మంచం చివర కూర్చుంటూ.

"సెలబ్రేషన్ అన్నాను కదూ ? ఏ సినిమాకో-హోటల్‌కో రమ్మంటే మీరు రారు. సమయానికి ఆదుకున్నారు. మీ మేలు ఈ జన్మలో మర్చిపోలేను. అందుకే కొంచెం స్వీటు-హాటు తెచ్చాను."

"నాకెందుకండీ" అంటూ మోమోట పడింది. ఏనాటినించో అడగాలనుకున్న ప్రశ్న అడిగేసింది. "మీ డిపార్ట్‌మెంట్ వారు అడగలేదా పార్టీ ? ఎక్కడ పని జేస్తున్నారండీ ?"

"కష్టాలలో ఉన్నప్పుడు - జీతంరాక నానా హైరానాపడినప్పుడొక్కడు ముందుకొచ్చి — 'ఎలా మేనేజ్ చేస్తున్నారు ? జీతం రావటంలేదుకదా ? ఏమైనా కావాలా ? తర్వాత ఇవ్వొచ్చులే ...అహ' ... ఇలా ఒక్కరైన అన్నారను కున్నారా ? జీతం రాగానే గద్దల్లా తన్నుకుపోవాలని చూశారు. పైగా పార్టీ అట పార్టీ. అదేమాట గట్టిగా వారెదుటనే అడిగేశాననుకోండి. ముఖాలు ముఖాలు చూచుకుని నత్తగుల్లల్లా ముడుచుకుపోయారు. వారిలో కాస్త ధైర్యవంతుడూ- ఏ గాలికాచాప ఎత్తగల వ్యవహార దక్షతగలవాడూ ఒకడు మాత్రం 'అమ్మైనా అడగందే పెట్టదంటారు. మరి ఒక్కసారి మమ్మల్నెవరినైనా అడిగారూ?' 'ఎలా అడుగుతానండీ. కొత్తవాణ్ణి కదా. మీరంతా కొత్తే - మీకు నేనూ అంతే. మీరు ఒకప్పుడు జీతం అందక కష్టాలుపడినవారే అయిఉండవచ్చు. లేదా ఆ కష్టం లేకనూ పోవచ్చులెండి. అంతదూరం ఆలోచించలేదు మీరు. మర్చిపోయి ఉంటారు. బోలెడు అప్పులు చేశాను. పార్టీ యివ్వటానికి వీల్లేదు' అనేసి వచ్చాను."

"మరైతే ఒక్కడికి మాత్రం ఇవెందుకు తెచ్చారు ?" ఆ కంఠంలో ఓరు కోపం ఉన్నట్లు గ్రహించిన మాలతి ఆశ్చర్యపోయింది.

అతను ఖిన్నుడై, కళ్ళు చిట్లించి ముఖం కొద్దిగా ప్రక్కకువంచి ఆమెను చూచాడు. ఆ చూపు ఆమె కళ్ళలో చొచ్చుకునిపోవటమేకాక హృదయంలో ఎక్కడో మూసివేసిన తలుపులను బలంగా తట్టినై. అవి ఛళ్ళున తెరుచుకుని మధుర మందహాస రూపంతో ఆహ్వానిస్తుంటే ఆమె మరి మూసివేయలేక

పోయింది. అతడు మెల్లగా ఆవేశాన్ని అణచుకున్నట్లుగా అన్నాడు "వారూ - మీరూ ఒకటేనా? నా పరువు కాపాడారు. మందులకు డబ్బు మీరివ్వబట్టి మా అమ్మమ్మకు స్వాస్థ్యం చేకూరింది. లేకపోతే మా తాతయ్య అనేమాటలు భరించ లేక ఎటో పారిపోయేవాణ్ణి. అతడి మాటలు ఎదుటి వ్యక్తిని అంత పిరికిగా తయారుచేస్తాయిలెండి. మీరు లేదనకుండా నెలాఖరురోజులైనా ఇచ్చారు. మీ మేలు మరువలేను."

"పదిహేను రూపాయలకే నయమైందంటారా ?"

"లేదనుకోండి. కానీ పడవలసిన మందు సమయానికి పడటంలోనే ఉందికదా! అందుకే మీరంటే నాకు ప్రత్యేకమైన అభిప్రాయం ఏర్పడిందంటే ఆశ్చర్య మేముంది? ఐనా నా కొచ్చినదాన్లో ఈ మూడు రూపాయిల మిఠాయి పెద్ద లెక్క కాదు. ఏదో నా తృప్తి - తినండి" పొట్లం అందించాడు.

ఆమె రెండు ప్లేట్లలో సర్ది అతడి కందించింది. ఒకటి తను తీసుకుంది. "ఒద్దు" అంటూనే తిన్నాడు. "మీరింత స్నేహంగా నన్ను కూర్చోబెట్టి మీ భాగంలో నాకూ పంచుతారని తెలిసినట్లయితే మరికొంచెం తెచ్చేవాణ్ణి. గుమ్మం అవతలేగా నా స్థలం. అందుకని కొద్దిగా తెచ్చాను." ఆమె ఫరవా లేదన్నది మంచి నీళ్ళందించింది. అతడు తాగి లేచి నుంచున్నాడు. "వెళ్తాన్తాను. సినిమాకు టైం అయింది. మీరు రారని తెలుసు. పిల్చి మిమ్మల్ని ఇరకాటంలో పడెయ్యటం మూర్ఖత్వమే అవుతుంది మీకు చాలా థాంక్స్"అని వెళ్ళిపోయాడు.

ఆమె తలుపు చేరవేసి కూర్చుంది ఎందుకో నోటిలోని తీపి తనువంతా ప్రాకుతున్నట్లుంది. అతడుకూర్చుని వెళ్ళిన కుర్చీలోని వెచ్చదనం ఆమెకు వింత అనుభూతిని కల్గించింది. అతడు త్రాగివెళ్ళిన గ్లాసులో మిగిలిన నీళ్ళు ప్రేమతో నిండిన సరస్సులా కనిపిస్తోంది. ఆ నీళ్ళలో ఆమె ప్రతిబింబం పద్మంలా తేలి పోతూ ఎక్కడికో.. ఎక్కడికో వెళ్ళిపోతోంది!

* * *

అతడు అప్పుడప్పుడు కనిపిస్తాడు. చిరునవ్వు నవ్వి విష్‌చేసి ఏదో పలుక రించి వెళ్ళిపోతున్నాడు, అంతే. కానీ అతడు చేరువకాలేకపోతున్నా డనుకుని బాధపడేది. ఇదీ మంచిదే - అనుకుని ఓ వైపు తృప్తి చెందేది. పక్షంరోజులు గడిచిపోయాయి. ఒకరోజు సాయంత్రం ముఖం వేలాడేసుకుని వచ్చాడు. తలుపుదీసి ఈమారు పక్కకుతొలగి నుంచుంది. అతడు తటపటాయిస్తూనే లోపలికెళ్ళి కూర్చున్నాడు.

"చాలా చిక్కులో పడ్డాను. మీ సహాయం కావాలి "

"ఏమిటి ?" మాలతి ఆత్రం దాచలేకపోయింది.

"రెండువందల చిల్లర ట్రంక్‌లో పెట్టివెళ్ళాను. చిన్నచిన్న అప్పులున్నాయంటూ డబ్బు అడగటం ప్రారంభించాడు మా తాత. అందుకని తాళంవేసి పెట్టుకున్నాను. నా ఖర్చులకని అరవై ఇచ్చాను. ఇంటద్దె ఇరవైఐదు నేనే కట్టాను. నా భోజనం, టిఫిన్ బైటనే. రాత్రుళ్ళు లైట్‌గా ఏదో తిని పండుకుంటాను. ఇవ్వాళ చూస్తే పదిరూపాయలే ఉన్నాయి. అడిగితే 'నేనే తీసుకున్నాను. ఏం - తీసుకోకూడదా ?' అని రెట్టించాడు పైగా! ఇంకా పదిరోజులున్నాయి...'' మాటలు నాన్చాడు.

''మీకు డబ్బు కావాలా ? నా దగ్గర ఎక్కువలేదు. ముప్పై సర్దగలను." అంటూనే లేచి పెట్టెతీసి మూడుపదులు అతని కందించింది. రాజేంద్ర ఆ నోట్లతోనే ఆమె చేతిని తన రెండు చేతుల్లోకి తీసుకున్నాడు. కళ్ళలో నీళ్ళు తిరుగుతుంటే ఆరాధనతో ఆమెను చూచి అన్నాడు. "మీరు దేవతలు." ఆనోట్లు అందుకుని మరి ఆగకుండా గబగబ వెళ్ళిపోయాడు.

ఆమె అలాగే చూస్తుండిపోయింది. ఏమిటీ వింతవ్యక్తి ? అంత త్వరగా వెళ్ళిపోయాడెందుకని ? ఆ చేతిని చూచుకుంది. బలిష్టమైన ఆ చేతుల్లో తన చేయి ! ఆ వెచ్చదనంలోని తీయదనం ! తన ఒళ్ళు గగుర్పొడిచినంతగా అయింది.

ఒకరోజు చనువుగా అడిగింది "మీకు పెళ్ళికాలేదా ?"

అతడు హాయిగా నవ్వాడు. తల వెనక్కివేసి నవ్వుతుంటే అతడి చిక్కటి నల్లటి వెంట్రుకలు వెనగ్గావాలాయి. "అయిందని ఎలా అనుకుంటున్నారు ?"

"మరి మీకోచ్చే డబ్బుతో హాయిగా ఉండక ఈ చిన్న యింట్లో ఉండటం దేనికి ? పొదుపు చేస్తున్నారేమో! కుటుంబం లేకపోతే ఈ పొదుపంతా దేనికి ?"

"నిజమే. అంటే చిన్నసైజు ఆఫీసరుకుండవలసిన దర్జాలు నాకు లేవనేగా ?" - మూడుపదులు బల్లమీదపెట్టి "చాలా థాంక్స్" అన్నాడు.

ఈ మాటు మళ్ళీ అడిగింది. "మీరెక్కడ పనిజేస్తారో ఇంతవరకు చెప్పారు కారు. సి. బి. ఐ. లోనా ?" అంది నవ్వుతూ - డబ్బు పర్స్‌లోదాచుతూ.

అతడి ముఖం ఆశ్చర్యాన్ని కనపర్చింది. "అరె - ఎలా కనుక్కున్నారు ?"

ఈసారి ఆశ్చర్యపడటం ఆమెవంతు అయింది. "రహస్యంగా ఉంచుతున్నారని అలా అడిగాను. అదే నిజమైంది." గెలిచాను అన్నట్లు చూచింది.



"కనుక్కున్నారుగాని రహస్యంగా పెట్టండి. చాల పెద్ద పనిమీద వచ్చాను. అందుకే ఈ షో."

"ఐతే వాళ్ళు మీ తాత అమ్మమ్మలు కారా ?"

"ఔననుకోండి. కానీ వారికి ఏం తెలీదు. ఏదో క్లర్కుపని అనుకుంటు న్నారు. నేను పేదగా – ఈ చిన్న యింట్లో ఉండటం నా 'పని'కి ముఖ్యం."

"ఓ" అంది సాలోచనగా.

"ఎవరికి చెప్పరుగా ! రహస్యంగా ఉంచాలి."

"ఉహు, చెప్పను."

"ఐతే నా విషయాలు చెప్పేస్తాను. మీరు నాకు సన్నిహితులు, ఆత్మీయులై పోయారుగా ? ఇక ఫరవాలేదు. మాది నెల్లూరు దగ్గర పల్లె. అతి సాధారణమైన కుటుంబం మాది. ఇద్దరక్కలు ఒక అన్న. అందరికీ పెళ్ళయింది. నాకు చేయాలని ఆలోచిస్తున్నారనుకోండి. నేను బాగా చదువుకుని హైద్రాబాద్‌లో ఈ బ్రాంచిలో చేరాను. చదువుకోవటంమాత్రం బి.ఎ. వరకే లెండి. స్పోర్ట్స్‌లో బాగా ఉండేవాణ్ణి. నా సర్టిఫికెట్లు, డిగ్రీ, రికమెండేషన్ లెటర్స్ అన్నీ చూపిస్తాను. ఫొటోలు కూడా.

ఒకనాడు పెద్ద ఫైల్ తెచ్చి చూపించాడు. అవి చూస్తుంటే మాలతి హృదయం ఉప్పొంగిపోయింది. స్పోర్ట్స్ డ్రస్సులో ఎంతో ఆకర్షణీయంగా కనబడుతున్నాడు. అప్పటి ముఖంలో కాస్త అమాయకత – లేతదనం అగుపిస్తోంది. చూస్తూ చూస్తూ ఒక్కసారి రాజేంద్రవైపు తిరిగి పరీక్షగా చూచింది. "ఓకేలా ఉన్నానా ! ముసలాడిలా ఉన్నానా ?'' ఆమె చుబుకంపట్టి సూటిగా ఆమె

కళ్ళలోనికి చూస్తూ అడిగాడు. మాలతి మెల్లిగా చేయి తప్పించి సిగ్గుపడుతూ తల దించేసుకుంది.

రాజేంద్ర రాత్రుళ్ళు చనువుగా వచ్చికూర్చుని కబుర్లు చెప్పి వెళ్తుంటాడు. రెండురోజుల కొకసారైనా ఆమె వంటజేసి పెడ్తుంది. మెచ్చుకుంటూ తృప్తిగా తినిలేస్తే మాలతి ఆనందాని కవధిలేకుండా పోయేది.

తాను పట్టిన కేసులను గూర్చి చాకచక్యంతో వినేవారి నాకట్టుకుని చెబుతుంటే ఆమె అతణ్ణి ఆరాధిస్తూ వినేది.

సంవత్సరం గడిచిపోయినా రాంజేంద్ర తన పరిధి దాటి వెళ్ళలేదు.

అతడి ప్రవర్తనలో ఏలోపం లేకపోవటంతో మాలతి హృదయంలో అతనికి స్థానం దొరికింది. ఆమె అతణ్ణి ప్రేమిస్తోంది. తన జీవితమంతా అతనితో గడపాలని – అతని భార్యగా తన జన్మను తరింపజేయాలని ఉవ్విళ్ళూరింది. రాజేంద్ర ఆమె తలపులను, హృదయాన్ని ఆక్రమించాడు. అతనికి అందంగా కనబడాలని తాపత్రయపడేది. మంచి చీరలు కొనుక్కుంది. రెండు జతల గాజులు చేయించుకుంది. ముత్యాల నెక్లేస్ కొనుక్కుంది. ఒకటి రెండు మార్లు సెకండ్‌షో సినిమాకు కూడా వెళ్ళింది రాజేంద్రతో. వారం రోజులు రాజేంద్ర కనబడలేదు. ఆ తర్వాత ఒకనాటి రాత్రి వచ్చాడు. స్నానంచేసి మాలతి తలుపు తట్టాడు. అలసిపోయిన అతని ముఖం చూచి ఆమెకు జాలివేసింది. త్వరగా చపాతీలు – వంకాయవేపుడు చేసి వడ్డించింది. అతడు తిని – సేదతీరి ఆమె చేయిపట్టుకొని ఆమె విడిపించుకునేలాగా చేతిలో చిన్న డబ్బా పెట్టాడు. అది నగపెట్టె. మాలతి మెల్లగా తెరచి చూచింది. ఒక వరుస నాల్గుకెంపులు – మరొక వరుస నాల్గు తెల్లరాళ్ళు పొదవిన ఉంగరం

"మాలతీ– నేను చేయకూడని పని చేయటంలేదనుకుంటాను. నిన్ను పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను. నీకూ సమ్మతమేనని నాకు తెలుసు. ఇలా రా"

మాలతి మెల్లగా దగ్గర కెళ్ళింది. ఆమెచేతిని ఆప్యాయంగా అందుకొని వేలికి ఉంగరం తొడిగాడు. అలాగే అతడి చేతులు పాకుతూ ఆమె నడుముచుట్టూ వెళ్ళాయి. క్షణం మాలతి బిగుసుకుపోయినా మరుక్షణం అతడి బిగికౌగిలిలో అనిర్వచనీయమైన ఆనందా న్ననుభవించింది. మెల్లగా సుకుమారంగా ఆమె ముఖాన్నెత్తి ఆవేశంతో ముద్దుపెట్టుకొన్నాడు. మాలతి శరీరంలో విద్యుత్తు ప్రవహించినట్లైంది. గట్టిగా కళ్ళుమూసుకొనే అతని

మెడచుట్టూ చేతులువేసింది. కొన్నిక్షణాలు ఆ కౌగిలిలోని మాధుర్యం అనుభవించాక మాలతి మెల్లగా విడిపించుకొని దూరంగా జరిగింది.

"పనిమీద హైద్రాబాద్ వెళ్తున్నాను. రాగానే రిజిష్టర్ మేరేజి చేసుకుందాం. సరేనా?"

ఆమె ఆనందానికి అంతులేదు. సరేనన్నది. వారిపెళ్ళికి ఎన్నో అడ్డంకులున్నాయి. అందుకే రిజిస్టర్ మేరేజి మంచిదనుకుంది.

నాల్గురోజులు వెళ్ళిపోయాయి. అనుక్షణం మాలతి తీయటి ఊహలతో, అతని కౌగిలిలోని స్వర్గసౌఖ్యాన్ని తలపోస్తూ కాలం గడుపుతోంది. ఒక్కొక్క రోజు ఒక్కో యుగంగా గడుస్తున్నాయి.

ఐదవరోజు ఎక్స్ప్రెస్ ఉత్తరం వచ్చింది.

ఆత్రంతో తెరచి చూచింది. - హృదయం ఆనందాతిశయంతో గబగబ కొట్టుకుంటున్నది. రాజేంద్ర రాసిన లేఖ.

"మై డియరెస్ట్ మాలా!

ఆదివారం తెల్లవారి దిగుతున్నాను. చాలా పనితొందరలో ఉన్నాను. నీ దగ్గరుంటే ఒక ఐదువందల రూపాయలు టి.యం.ఒ. చెయ్యి. చాల రహస్యంగా ఉంచు. ఈ క్రింద అడ్రస్ రాస్తున్నాను. రాగానే ఇచ్చేస్తాను.

లవ్

నీ—రాజేంద్ర"

ఉత్తరం చదివి నవ్వుకుంది. రాగానే ఇచ్చేస్తాడట!

వెంటనే సెలవడిగి ఐదువందలు డ్రాచేసి టి. యం. ఒ. చేసి వచ్చేసరికి మధ్యాహ్నమైంది. మరి మూడురోజులు. అంతే - ఈ విరహ వేదన మరి ఉండదు. క్షణమొక యుగంగా గడిపింది.

ఆదివారం వచ్చేసింది. రాజేంద్ర వచ్చాడు - ఇంకా తెల్లవారలేదు.

రెండు గులాబి పువ్వులు తెచ్చాడు. వాటిని అందిస్తూ దగ్గరకు తీసుకున్నాడు. మాలతి అతని విశాల వక్షస్థలంమీద తల ఆన్చి తృప్తితో కళ్ళుమూసుకుంది. రాజేంద్ర ఆమెను పొదివి పట్టుకొని ప్రేమపాఠం వల్లించాడు. తరువాత ఇద్దరూ ఎడమై మంచంమీద కూర్చున్నారు.

"అమ్మమ్మకు కనిపించాలి. లేకపోతే ఏదో గొడవ పెడ్తుంది. ఇదిగో నీడబ్బు" అంటూ ఐదువందల రూపాయల నోట్లు అందివ్వబోయాడు. ఆ క్షణం ఎంతో విలువైనదిగా ఉంది మాలతికి. ఆ పవిత్రసమయాన్ని డబ్బు మలిన పరుస్తుంది.

"అప్పుడే తెచ్చారు. నేను అడిగానా!" అంది బుంగమూతిపెట్టి.

"ఓ...కె... నీకు కోపంవచ్చింది. రేపు బాంక్‌కు వెళ్ళి నేనే కట్టేస్తాను. సరేనా!" అంటూ నోట్లను నిర్లక్షంగా జేబులో పెట్టుకున్నాడు. "డబ్బు - డబ్బు - డబ్బు. ఇక ఏ మాటలూ లేవా?"

"ఉన్నాయి, రేపే మన పెళ్ళి."

"ఔనా?" అన్నట్లు కళ్ళు విశాలంచేసి ఆశ్చర్యాన్ని ప్రకటించింది.

"ఒద్దా?" చిలిపిగా చూస్తూ అడిగాడు.

"ఒద్దు" అని పకపక నవ్వింది.

"సరేలే. చాలా పనులున్నాయి. వస్తాను'' ఆమె భుజాన్నితట్టి లేచి వెళ్ళి పోయాడు.

ఆ సాయంత్రం వచ్చి - ఓ రెండు నిమిషాలు పలకరించి వెళ్ళిపోయాడు. మాలతి పడుకుంది, తీయటి కలలుకంటూ. ఇంకొక్క పన్నెండు గంటలు. తను రాజేంద్ర సొత్తయిపోతుంది. తనకు పెళ్ళి. కొన్నాళ్లు నలుగురూ 'రిజిష్టర్ పెళ్ళి చేసుకుంది' — అంటారు. ఆ తరవాత అంతా తను మామూలుగానే చూస్తారు. తన కష్టాలన్నీ గట్టెక్కుతాయి. మధురమైన ఊహలు అల్లిబిల్లిగా అల్లుకు పోతుంటే నిద్రరాక మంచంమీద పడుకుని కనబడని నక్షత్రాలకేసి చూస్తోంది. ఎక్కడో పదకొండు కొట్టారు.

ఎవరో తలుపు తట్టారు.

గాభరాగాలేచి "ఎవరు?" అంటూ కిటికీలోంచి చూచింది.

"నేనే మాలా" రాజేంద్రకంఠం.

మాలతి తలుపు తీసింది. అతను మెల్లగా లోపలికొచ్చి తలుపు గడియ వేశాడు. ఆ చీకటిలో అతడు చేతులు చాచినట్లు మాలతికి తెలియదు. మరు క్షణంలో ఆమె అతని కౌగిలిలో ఉంది!

* * * *

తెలతెలవారుతుండగా మెలకువ వచ్చింది. రాజేంద్ర లేడు. పక్కలో నలిగిన రెండు గులాబి పువ్వులు - గతరాత్రి కథను గుర్తుకు తెచ్చాయి. నలిగిన ఆ పూలను చేతుల్లోకి తీసుకుని ఆఘ్రాణించింది. వాసనలేవు. నవ్వుకుని పార వేసింది

తను తొందరపడిందేమో!

తొందరేముంది. ఇవ్వాళ లోకందృష్టిలో తను అతడి భార్య అయిపోతుంది. తను తప్పుచేయలేదు. ఇంకొన్ని గంటలే.

తలుపు తోసుకుని వచ్చాడు రాజేంద్ర. అతణ్ణి చూడగానే ఏదో నూతన అనుబంధం తాలూకు ఆనందం హృదయాన్ని ఆవరించింది విప్ఫారిత నేత్రా లను ఓ మారు నులుముకుంటూ లేచి కూర్చుంది. పక్కలో కూర్చున్న రాజేంద్ర భుజంమీద తల ఆన్చింది. రాజేంద్ర ఆమె నడుముచుట్టూ చేయివేసి పరిహాసంచేస్తూ అన్నాడు "పెళ్ళికూతురు - ఇంకా మంగళస్నానం చేసినట్లు లేదు నేనా చూడు!"

ఆమె నవ్వింది. గభాల్న లేచి గుడ్డలు తీసుకుని బాత్‌రూంలోకి వెళ్ళ పోయింది "ఆగు" అంటూ మంచం క్రిందినించి ఒక సూట్‌కేస్ తీశాడు. దానిలో తడిగుడ్డలున్నాయి. పైన ఒక పాకెట్ ఉంది. అది ఆమెచూసేలా తీసి పైన పెట్టాడు.

''ఇది నీకు. కానీ ఇప్పుడే చూడకూడదు. మనం కలసి వెళ్ళేటప్పుడు కట్టు కోవాలి." ఆమె నవ్వి వెళ్ళిపోయింది అదేమిటో పాదాలు భూమిమీద ఆనినట్టు లేదు. అంత హాయిగా ఉంది మనసు.

తలారా స్నానంచేసి తడి వెంట్రుకలను టవలుతో చుట్టి చలువచేసిన తెల్ల వాయిల్‌చీర చుట్టుకొని వచ్చింది.

గదిలో రాజేంద్ర లేడు. నవ్వకుంది. మళ్ళీ వస్తాడు. మంచీ మర్యాద తెలిసినవాడు. తను ఫ్రీగా డ్రెస్ చేసుకోగలదు. తలుపు జారవేసి లోపలికెళ్ళింది. అక్కడున్న సూట్‌కేస్ లేదు. మంచంమీద ఉన్న చీర పాకెట్‌లేదు సరిగదా ఆ స్థానంలో బ్రౌన్ కవరుంది. దానిమీద చిరునామా లేదు. ఏమిటిది?

ఏమైనా అర్జంటు పని తగిలి వెళ్ళేడేమో అని, గబగబ చీరకట్టుకుని బ్రౌన్ కవరు అందుకుని ఆత్రంతో లోపలి కాగితాలు లాగింది. రాజేంద్ర ఉత్తరం: తారీఖు అదేరోజు ప్రాతఃకాలం 5 గంటలు.

ఆమెను సంబోధించలేదు. చదువుతూపోతున్నకొలది ఆమె రక్తాన్నెవరో పిండేస్తున్నట్లుంది. కళ్ళు బైర్లుకమ్మి నిస్త్రాణతో తలగడమీద తల ఆన్చింది. పూర్తిగా చదివే ధైర్యంలేదు. చేతికి నలిగిన పూలు తగిలాయి. అవి తగలగానే దుఃఖం కట్టలు తెంచుకొంది. లేని ఓపిక తెచ్చుకుని తలుపు గడియవేసి మళ్ళీ చదవటం ప్రారంభించింది

"నేను మళ్ళీ పోతున్నాను. ఎక్కడికి అని అడక్కు. మరొక కొత్త స్థలానికి. నీలాటి మరో వ్యక్తిని మోసపుచ్చి దొరికింది తీసుకుని పారపోవటానికి...!!

తడబడుతున్న కాళ్ళతో పరుగున వెళ్ళి డ్రాయర్ లాగింది. తన నగలుఏమీ లేవు. పర్స్‌లో కాస్త ఎక్కువే పెట్టింది. పెళ్ళిరోజు కదా! నూట ఏభై రూపాయలు లేవు. చిల్లర మాత్రం ఉంది. పరుగున వెళ్ళి పెట్టె తెరచింది. నాలుగైదు మంచి చీరలు లేవు. కొత్తగా కొనుక్కున్న ఐదు గిన్నెల స్టీలుటిఫిన్ కారేజి లేదు.

ప్రభూ—ఏమిటిది? ఇలా ఎందుకు జరిగింది—ఇంతలా మోసపోయానేమిటి? నేనింత చౌకబారు వ్యక్తినా? ఆందోళనతో బాధతో ఉవ్వెత్తున లేస్తోన్న హృదయాన్ని అదిమిపట్టి తిరిగి చదవటం ప్రారంభించింది.

"నేను నీకు చెప్పిన జీవిత కథ నిజమే. బి.ఎ. చదివాను. ఉద్యోగం దొరకలేదు. ఆకలి బాధ అంటే ఏమిటో నాకు తెలుసు. కోటి విద్యలు కూటి కొరకే కదా! ఈ విద్య అలవర్చుకున్నాను. ఐదేళ్ళుగా జీవితం ఈ విధంగా గడిచిపోతోంది. మూడు పూటలు తింటున్నాను. చేతిలో వందలు ఆడకపోయినా పర్స్ ఖాళీగా ఎన్నడూలేదు. నిరుద్యోగి - పేదరికపు చిహ్నాలన్నీ మాయమైపోయాయి.

"నీలా ఒంటరి వాళ్ళను - పెళ్ళికానటువంటి ఉద్యోగినులను పట్టటం చాలా



సులభమని గ్రహించాను. నీ స్నేహాన్ని సంపాదించాలని ఎంతో తాపత్రయ పడినా గుంభనంగా మెల్లమెల్లగా జయించాను. కొందరు చాలా త్వరలోనే వలలో పడిపోయారు. నీవు అందని పండుగా కనిపించావు. అందుకని నిన్ను పొంది - నీ సొమ్ము అపహరించాలని దుష్టతలంపును అహంకారంతో ఆచరణలో పెట్టాను.

“ఇలాగే ఈ సమయంలో మరిఇద్దరిని విడిచి వెళ్ళిపోవాలి. ఒకే సమయంలో ముగ్గురి దృష్టిలో మంచివాడిననిపించుకుని - నమ్మకం కల్గేలా ప్రవర్తించి ఈ పద్నాలుగు నెలలు మీ సొమ్ము తింటూ కాలం గడిపాను. ఒకరింట్లో కాఫీ టిఫిన్- మరొకరింట్లో భోజనం. ఇలాగే మీ ముగ్గురి సందున నాకు బాగానే డబ్బొచ్చింది.

“నీలాగే ప్రతివారు తామంతట తామే నా దగ్గరికి వచ్చారు. నేనెవ్వరిని బలాత్కారించలేదంటే మీ అందరి దృష్టిలో నా స్థానం ఎంత ఉన్నతంగా ఉన్నదో గ్రహిస్తే నా నటన మీకెంతో ఆశ్చర్యాన్ని కల్గిస్తుంది.

“మా తాత గట్టివాడు. నాదగ్గర డబ్బున్నదంటే తన వ్యసనాలకు నా నించి డబ్బు లాగచూస్తాడు. అందుకని అతడి ముందర నీ నించి అప్పుగా తీసుకున్నాను. మా తాత ఉనికి నా కెంతో అవసరం. మీ ముగ్గురు నన్ను దొంగగా తలంచకుండా ఇతడొక బురఖా. అమ్మమ్మకు చెవుడు. తాతయ్య కిళ్ళీ కొట్టు దగ్గర మకాం. అందుకే ఎన్ని కల్పితకథలు చెప్పినా అవి బైటికి పొక్కలేదు. నువ్వెళ్ళి ఎవర్నీ అడగవు. నా మీద అనుమానముంటే కదా !

“నాకు కవిత్వం రాదు. దానికి లొంగుతావేమోనని చూచాను అంతే. ఎవడిదో కాపీ కొట్టాను. అది నా స్వంత కవిత్వం కాదు. నాకు ఎక్కువగా రాయటం కూడ ఇష్టంలేదు. టైం వేస్ట్ కూడా.

కొన్నాళ్ళు ఈ డబ్బుతో హాయిగ జీవించగలను. మీ లాంటివాళ్ళు పోలీస్ రిపోర్ట్ ఇవ్వరనే ధనవంతులజోలికి పోకుండా మీలాంటి వారి ఆదరణకోసం పాటుపడ్తుంటాను.

నువ్వు అదృష్టవంతురాలివి. ఒకామెను పెళ్ళాడి నెలకావస్తోంది. మరొక దానితో ఆరు నెలలుగా 'స్నేహం'తో ఉంటున్నాను.

"అంతేకాదు. రాత్రి నువ్వు ఐదు వందల తీసుకోలేదు. తీసుకోనంతా మంచిదే. అవి దొంగనోట్లు. నేను ఇంకొకరకం "సి. ఐ. డి.ని.

"మా తాత అమ్మమ్మను ఏమీ అడక్కు. వారికేమి తెలియదు. నాకు ట్రాన్స్ ఫర్ అయిందని చెప్పాను. వందరూపాయ లిచ్చాను. ఎంతో సంతోషించారు. చెప్పకుండా వెళ్ళిపోదామనుకొన్నాను గాని నా కోసం ఎదురు చూస్తావని జాలి తలచి రాస్తున్నాను.

"మరొకమాట. నెల పోయాక నీకు డాక్టర్ అవసరం కల్గితే ఈ క్రింది చిరునామాకు వెళ్ళు. ఆమె నీకు సహాయం చేస్తుంది."

ఆఖరి మాటలు చదివి ఆమె నిలువెల్లా కంపించిపోయింది. ఒక్కొక్క అక్షరం అణువణువును దహించివేస్తుంటే హృదయవిదారకంగా రోదించిది.

ఒకనాడు తనకు అనుమానం వేసింది. అతడు పెళ్ళి అన్నాడు. ఆరోజే తను చేస్తున్న పని సరియైనదేనా అని ప్రశ్నించుకుంది. తన హృదయానికి తగినట్లుగా జవాబు చెప్పుకొంది.

తన పెళ్ళిరోజు – నిర్జీవంగా నవ్వుకుంది. పిచ్చిగా తిరిగింది. అద్దంలో ప్రతిబింబం భయంకరంగా కనిపించింది. తలనించి కారిన నీరు కన్నీరు ఏకమై ధారకట్టినై. ఆ వికృతరూపాన్ని చూచి అనుకుంది. 'మనిషి ఎంత త్వరగా మారిపోతాడు!'

ఆమె బాధ తనను గూర్చి మాత్రమే కాదు. ముందు ఎందరు ఏయే ఊళ్ళలో మోసపోయారో! తనతోపాటు మరి ఇద్దరి జీవితాలు నాశనమైనై. ఈ వేళ మరెందరివి కానున్నవో! ఇటువంటి వారిని అరికట్టే మార్గంలేదా!

తన అవివేకానికి తనకే నవ్వు వచ్చింది. తన పిచ్చిగాని – ఇటువంటి వాళ్ళుంటారని తను పేపర్లలో, కథల్లో చదవటంలేదూ! మరిఅతడంతయుక్తితో చాకచక్యంతో నమ్మకంగా ఉండి ద్రోహంచేశాడు. చదువుకున్నది – ఇటువంటి వారుంటారన్న జ్ఞానంకల్గిన తనే ఈ వలలో చిక్కుకున్నది. ఎవరికి – ఏమని చెప్పగలదు.

ఆ రోజంతా కుమిలి కుమిలి ఏడ్చింది. అంతకు ముందు – ఆరాత్రి స్వర్గ సౌఖ్య మనుభవించాననీ మురిసిపోయింది. ఈ రోజు అదొక విషజ్వాలగా తలంచింది. ఇప్పుడదంతా ఇంకా జుగుప్సాకరంగా భరింపరానిదిగా అయి హృదయంలో అశాంతిని రేపుతోంది. అవమానభారంతో శరీరమే కుంచించుకు పోతున్నట్లు భావించింది. దుఃఖమే శరణ్యమైంది.

ఏకధాటిని వారం రోజులు సెలవు పెట్టింది. ఏ జబ్బు లేకపోయినా ఏదో పెద్ద జబ్బువచ్చినట్లు ఫీలయింది. ఫ్రెండ్స్‌వచ్చి చూచి వెళ్ళారు. మాలతి వాలకంచూచి వాళ్ళెంతో ఆశ్చర్యపడ్డారు.

మాలతికి ఆత్మహత్య చేసుకోవాలన్నంత నిరాశ కల్గింది. కానీ ఎలాగో ధైర్యం చెప్పుకుంది. మళ్ళీ ఆఫీసుకెళ్ళటం ప్రారంభించింది.

రోజులు గడుస్తున్నాయి. యాంత్రికంగా వెళ్ళివస్తోంది. అతని ఆఖరిమాటలు ఆమె నెప్పటికప్పుడు భయాందోళనలతో ముంచివేస్తున్నాయి. మానుతున్నగాయం రేగింది. ఏ విధమైన వికారం లేకపోయినా తనకు అనుమానం కల్గింది. ఆనాటి పూలబాటలోని ముళ్ళు బలంగా లోతుగా నాటుకుపోయాయి. కాళ్ళలో కాదు, హృదయంలో – గర్భంలో. అనుమానం దృఢమౌతున్నకొద్దీ ఆమె హృదయం బాధతో మూల్గుతుంది.

ఏంచెయ్యాలి! ఆత్మహత్య – ఛీ ... ఛీ ... తనకు భగవంతుడిపై విశ్వాసం, భక్తి యెక్కువ. ఈ తృణప్రాయమైన శరీరంలో ఆత్మనుంచి ఈ లోకానికి పంపారు. ఈ ఆత్మ ఆయనది. ఈ తృణప్రాయమనుకున్న శరీరాన్ని తను త్యజించటానికి తనకు హక్కులేదే! తనే తనది కాదు. నిత్యమైన ఈ ఆత్మపవిత్రతకోసం తను శ్రమించి తాపత్రయపడాలిగాని ఈ శరీరంకోసం కాదు. చనిపోయి సాధించేది లేకపోగా తన ఆత్మనాశనమైపోతుంది. దాని ఉనికి భగవంతుని సన్నిధానమే కదా! ఆ మహావకాశాన్ని తాను జారవిడుచుకోలేదు. బ్రతికి తను సాధించలేకపోవచ్చుగాని తను పిరికిది కాలేదు. ఏదో మార్గాన్వేషణ ప్రారంభించాలి అటువంటివారికి భగవంతుని సహాయం ఉంటుందంటారు!

రెండునెలలు. ఎంతకాలం దాచుకోగలదు!

ఏమీ తోచలేదు. మార్గంవెదకాలి. ఇంట్లో కూర్చుంటే పనికాదు. ఆమె రిక్షా తీసుకునీ కృష్ణాబ్రిడ్జిదాటి ఆవలి ఒడ్డుకు వెళ్ళి కూర్చుంది. ఆ రోజు ఆదివారం. తన స్నేహితులు తనూ తరచు వ్యాహ్యాళికెళ్ళే స్థలం అది. ఆ రోజు ఐదుగంటలైనా ఎవరూ రాలేదు. మరో గంటలో చీకటిపడ్తుంది. చేతిలో గొడుగుంది.

పర్స్ ఉంది. కాసేపు ప్రకృతిని తిలకిస్తూ కాలంగడిపి తిరుగుముఖం పట్టింది. మెల్లగా నడుస్తోంది బ్రిడ్జిమీదికొచ్చింది కాలిబాటన చాలామంది వెళ్తూ వస్తున్నారు. మాలతి కాసేపు రెయిలింగ్ పట్టుకుని నుంచున్నది. క్రింద నీరు వడిగా ప్రవహిస్తోంది. ఆ నీటి ఉరవడినిచూచి ఒకవిధమైన భయం ఆవరించింది. కళ్ళుమూసుకుని నుంచుంది. ఆ తరువాత తేరుకుని మళ్ళీ నడవటం ప్రారంభించింది.

ఆమె మరొకమారు బ్రిడ్జిమీద ఆగింది. తొంగిచూచింది. ఆ నీళ్ళలో తన భావిజీవితపు తాలూకు నీడలేమైనా కనిపిస్తాయా అన్నట్లు వెదుకుతుంది. ఉహూ– ఆ నీరు ఏదో భూమిని సస్యశ్యామలం చేయటానికి వడివడిగా వెళ్ళిపోతోంది తన కోసం సమస్యను పరిష్కరించటాని కిష్టంలేదు ! తను ఆ నీళ్ళలో పడిపోదు – అది నిజం. ఉస్సురని నిశ్వసించి మళ్ళీసాగిపోయింది.

ఆమె నాలుగడుగులు వేసిందో లేదో ఎవరో ఆమెను పిల్చారు – "ఏమండీ" అని. మాలతి వెనుదిరిగి చూచింది. స్కూటర్‌మీద ముప్పైఏళ్ళపైబడ్డ వ్యక్తి కూర్చుని ఉన్నాడు. "మీతో మాట్లాడాలి. బ్రిడ్జి చివర ఆగుతారా ?" అతను ఆమె జవాబుకోసం ఎదురు చూడకుండానే స్కూటర్‌మీద వెళ్ళి మలుపు దగ్గర ఆగిపోయాడు. మాలతి అతణ్ణి సమీపించి ఆగింది.

అతను స్కూటర్ ఆపుజేసి పక్కగాపెట్టి నుంచున్నాడు.

"మీరు రెండుసార్లు బ్రిడ్జిమీదనించి నీళ్ళలోకి చూచారు. అంతేకాక మీ ముఖంలో నిస్పృహ – రెండుసార్లుకూడ స్థిరనిశ్చయానికొచ్చినట్లు నిశ్వసించి నడిచారు. ఇదేదో ఆత్మహత్య బాపతేమో అని అడుగుతున్నాను. అంతే."

ఆమె అతడికేసి ఆశ్చర్యంగా చూచింది. ఈ వందలాది జనంలో తనను ఇతడు గమనించాడు ! తన ఉనికిని గుర్తించాడు.

"మీరు భయపడుతున్నారా ? ఈ పరాయివ్యక్తికి ఏం చెప్పాలని ?"

"ఔను. మీరెవరో తెలియదు, అనుమానపడటం సహజమే కదా."

అతడు మందహాసం చేశాడు. "నా పేరు ఆనందరావు అంటారు. ఇక్కడే ఇంజనీరుగా పనిచేస్తున్నాను. ఇవ్వాళ ఈ బ్రిడ్జి చెకింగ్‌కు వచ్చాము. సాయంత్రమైందని వెళ్ళిపోతున్నాను. మా యిల్లు స్టేషన్‌కు దగ్గర. ఇక చెప్పదలిస్తే చెప్పండి."

"నా పేరు మాలతి. బి.ఎ వరకు చదువుకున్నాను. పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో క్లర్క్‌గా పనిచేస్తున్నాను." ఆమె పరిచయం చేసుకుని ఆపుజేసింది. అతడు



ఆమె కళ్ళలోకి తీక్షణంగా చూశాడు. "నా ప్రశ్నకు జవాబు రాలేదు ... ఐనా ఇది అనువైన స్థలం కాదు" అంటూ ఆటూ ఇటూ చూచాడు. రిక్షా కనబడింది. "ఎక్కండి...స్టేషన్‌కు పద" అని రిక్షావాడికిచెప్పి అతడు స్కూటర్ మీద ముందుకు వెళ్ళిపోయాడు.

మాలతి దగాపడిందోమాటు. ఇప్పుడు రిక్షాలో వెళ్ళటానికి సంశయించింది. తను తెగించందే ఏమీకాదు - అనుకుని రిక్షా ఎక్కింది. ఆమెకు స్కూటర్ ఎక్కడా కనిపించలేదు. మధ్యలో రిక్షాను తిప్పి తన యింటికెళ్ళాలన్న ఆలోచన నతికష్టంతో తిప్పికొట్టింది.

స్టేషన్ దారిలో అతను రిక్షాను ఆపుజేసి డబ్బులిచ్చి పంపించివేశాడు. చిన్న ఇంటిముందుకు నడిచి "రండి, లోపల కూర్చుందాము" అని చిన్న గేటు లోంచి లోపలికెళ్ళాడు. నాలుగైదు పూలకుండీలు , ఒక మాలతీలత - ఒక బోగన్‌విల్లా లత, మెట్టతామరలున్నాయి. అంతా పదిగజాల చతురస్రంలో ఉందాతోట. అప్పటికే రెండు లాన్ చెయిర్స్ వేసున్నాయి. చిన్న కుర్రాడు చిన్న స్టూలువేసి వెళ్ళాడు. మరి కాసేపటికి కాఫీట్రే తెచ్చిపెట్టి వెళ్ళిపోయాడు.

అతడే ప్రారంభించాడు "మీరు ఇంటికెళ్ళకుండా వచ్చారు. అంటే మీరు పెద్ద ఆపదలోనైనా చిక్కుకుని ఉండాలి - లేదా పరిష్కారాని కందని, సమస్యతో సతమతమౌతుండాలి. మరొకవ్యక్తి సహాయం మీకు అవసరమైతే

నిస్సంకోచంగా చెప్పండి. నేను పరాయివాడినే కాని నా జీవితంలో కొన్ని నియమాలు పెట్టుకున్నాను. వాటి నుల్లంఘించలేదు. నా జీవితధ్యేయం ఒక్కటే. చేతనైనంతవరకు పరులకు సహాయపడటం." అతడు ఒక కప్పు ఆమె కందించి మరొకటి తను తీసుకున్నాడు.

"ఇంట్లో మీరొక్కరే ఉంటారా? మీ భార్య లేరా?" అతి మామూలుగా అడిగింది.

"ఇంట్లో నేను, ఆ పని కుర్రాడు ఉంటాము. నాకు పెళ్ళయింది. మూడేళ్ళ క్రితం విడాకులు తీసుకున్నాము."

ఆమె ఆశ్చర్యంతో చూచింది. 'నిజమేనా? ఇతడు మరొక రాజేంద్రకాడు కదా! అతడు చెప్పింది నమ్మదగునా?'

"ఏ కారణాలవల్ల విడాకులు తీసుకున్నామో! అనుమానంగా ఉండొచ్చు కదా! నాకు సంతానం కల్గించే శక్తిలేదు. అంటే నా రక్తం R.H. (Rhesus పాజిటివ్ - రక్తంలో ఒక రకమైన జబ్బు, పిల్లలకువస్తే వారు బ్రతకరు.) పాజిటివ్. ముందరే ఆపరేషన్ చేయించుకున్నాను. తలిదండ్రులామెకు బలవంతంగా పెళ్ళిజేశారేమో. నాకి యోగ్యతలేదని వెంటనే విడాకులడిగింది. విడాకులు తీసుకున్న నెలలోపుగా మరొక వివాహం చేసుకుంది. నాకు పిల్లలంటే ఎంతో అపేక్ష. పెంపకానికి తీసుకుందామని ప్రయత్నం చేశాను. కాని ఆమె వెళ్ళిపోయింది. ఈ మూడేళ్ళనించి ఇలా ఒంటరి జీవితం గడుపుతున్నాను నిస్సారమైన ఈ బ్రతుకులో ఏమార్పు లేదు. యాంత్రికంగా రోజులు వెళ్ళబుచ్చటమే. పునర్వివాహం చేసుకుందామని ఆలోచించానుగాని నా బలహీనతను అంగీకరించే విశాలహృదయిని దొరకలేదు. టైం కలిసిరాలేదని సర్దిచెప్పుకున్నాను. నాకు ముప్పైఎనిమిది సంవత్సరాలు. మా స్వగ్రామం వేటపాలెం. తల్లిఉంది, తండ్రి లేరు. మరొక తమ్ముడున్నాడు... మరి ఇక మీరు మీ మనసు విప్పి మాట్లాడవచ్చునేమో."

కాఫీ కప్పు మెల్లిగా స్టూల్‌మీద పెట్టింది.

"నేను మోసపోయాను. ఇంతా - అంతా అని చెప్పలేను. ఈ ఊబిలోంచి బైటపడి ఎలా గౌరవంగా బ్రతకాలో నాకు తెలియటంలేదు. మరి రెండునెల్లో నా గౌరవాన్ని నేను నిలబెట్టుకోలేకపోతే నన్ను అతి నీచంగా చూస్తుంది ఈ సంఘం. తలెత్తుకుని తిరగలేను. ఆత్మహత్య చేసుకునేటంత పిరికిదాన్ని కాను. మార్గాన్వేషణకై ఒటుగా స్నేహితుల యిండ్లకు వెళ్ళాను."

"విడమర్చి చెప్పలేరా ?" అతడు సిగరెట్ వెలిగించాడు.

ఆమె అతడివైపు చూచింది. అతని ముఖంలో మానవత ప్రతిబింబిస్తోంది. జీవితంలో హూటాహుటిని పోరాడిన చిహ్నాలలో నుదుటిమీది చారలు - మనిషి హృదయాంతరాల్లో చూడగలశక్తి ఉన్నదా - అనిపించే విశాలనేత్రాలు - నిండైన విగ్రహంలో కూర్చున్న అతడిపై ఆమెకు భక్తిశ్రద్ధలు ఏర్పడ్డాయి.

పర్సుతెరచి కాగితంతీసి దానిమీద తన ఇంటి అడ్రస్ రాసింది మరొక పాకెట్ తెరచి రాజేంద్రరాసిన ఉత్తరం తీసింది.

"ఇదొక లేఖ. నేను వెళ్ళిన తరవాత చదవండి. దానిలో మీ ప్రశ్నకు జవాబున్నది. ఇది నా అడ్రసు. చదివిన తరవాత దాన్ని పంపండి. లేదా మీ కభ్యంతరంలేకపోతే మీరు రావచ్చు. రిక్షా పిలిపిస్తే వెళ్ళిపోతాను. మీకు నా కృతజ్ఞతలు"

అతడామె అందించిన వాటి నందుకున్నాడు. వీధిలోకివచ్చి ఆమెను రిక్షా ఎక్కించి వచ్చాడు.

అతడు తారట్లాడలేదు. వెంటనే కూర్చుని ఉత్తరం ఆమూలాగ్రం చదివాడు.

* * *

ఇల్లుజేరిన మాలతి నిర్లిప్తంగా ఉండిపోయింది. తను అలా ఇచ్చివచ్చింది. ఇతడు మరొక పట్టువల తనచుట్టూ వేయటంలేదు కదా ! అసలు తనకేం కావాలి ? తనకు వివాహం కావాలి. ఈ పెళ్ళి బురఖాచాటున తన వ్యక్తిత్వాన్ని దాచుకోవాలి. తన గర్భఫలానికి పేరు - ఊరు ఇవ్వాలి. తను గుట్టుగా ఉద్యోగం చేసుకుంటుంది. తనకు కావలసినదల్లా ఒకటే. తనను వివాహం చేసుకుంటే చాలు. తనను పోషించనవసరంలేదు. తనకు వైవాహిక సుఖం యివ్వనవసరంలేదు. ఆ వ్యక్తి తరవాత ఎవరితో ఎలా ఉన్నా తను అడగదు. తనకు ఒకటే కావాలి. పెళ్ళయిన చిహ్నం - అంతే.

మరుసటిరోజు మాలతి అలసిపోయి ఇంటికొచ్చింది. కాఫీ తాగి విశ్రాంతిగ పడుకన్నది. మాగన్నుగా నిద్రపట్టింది.

రిక్షావాడు అమ్మగారూ అని పిలవగా మెలకువవచ్చి తలుపుతీసుకుని బైటికొచ్చింది. అతడు వస్తాడన్న విశ్వాసం ఆమెకు లేదు. ఎందుకొస్తాడు ? అతనికి కావలసింది కళంకంలేని కన్నెపిల్ల. తనలాంటి కాలుజారిన చౌకబారు మనిషికాదు.

ఆనందరావును చూచి ఆశ్చర్యానందాలను దాచుకునే నెపంతో ముఖాన్ని

కొంగుతో తుడుచుకుంటూ "రండి" అని లోపలికి దారితీసింది. ఆమె తన రాక కానందిస్తోందని ఆనందరావుకు తెలిసి సంతోషించాడు.

అతడే పలుకరించాడు "ఉత్తరం చదివి చాలా విచారించాను. ఒక వ్యక్తి లోని స్నేహశీలతను, నిజాయితీని మనం ఎల్లప్పుడు గౌరవిస్తాము. అది స్త్రీ అయినప్పుడు ఆరాధనాభావంతో ఉంటుంది. ఆమె అవివాహిత అయినప్పుడు ఆ ఆరాధనాభావం ప్రేమగామారి అతణ్ణి భర్తగా పొందాలనుకుంటుంది. ఇది సహజమైనది. ఆమె వివాహిత అయితే అతణ్ణి గౌరవిస్తుంది. అతడి సన్నిధిలో హృదయవికాసంపొంది ఆనందిస్తుంది. సోదరతుల్యునిగా భావిస్తుంది. కనుక మీరు సులభంగా మోసపోలేదని గుర్తుంచుకోండి. ఏ క్రమంలో అతడు మీకు చేరువఅయ్యాడో తెలియదుగాని అతడి ఉత్తరంద్వారా తెలిసినదాన్నిబట్టి చాల చతురతతో మీ మనసులో చోటుచేసుకున్నాడు." ఉత్తరాన్ని అందించాడు. ఆమె అందుకుని తలొంచుకుంది కొన్ని క్షణాలు మౌనంగా గడిచింది. ఆనందరావు అన్నాడు, "మాలతిగారూ – మీకేం కావాలి? ఏదో నెపంతో వెళ్ళిపోయి డాక్టర్ సలహాపొంది ఖాళీగా తిరిగొస్తారా? లేదా మరొకర్ని వివాహం చేసుకుంటారా? మీ హృదయంలోని మాట చెప్పి సెయ్యండి." అతడి మాటల్లో గంభీరతకు ఆమె చలించిపోయింది. ఇతడితో తన కోరికను చెబితే తప్పేముంది. నవ్వి వెళ్ళిపోతే వెళ్ళిపోనీ – అందువల్ల తనకేం అవమానం కల్గదు – అవమానం అన్నపదానికి అర్థం తనకులేదు. అంతాపోయింది- గౌరవం–పవిత్రత అన్నీ ఆ రాత్రే నలిగిపోయి వాడిపోయాయి.

అతడివంక నిశ్చలంగా చూసి కళ్ళువాల్చేసి మెల్లగా అంది, "ఎవరైనా నాకు పెళ్ళయిందన్న ముద్రవేసి వెళ్ళిపోతే చాలు. అతడు నాతో ఉండక్కర్లేదు. ఆ వివాహం లోకందృష్టిలో మాత్రం వివాహమైతే చాలు. నా ఈ స్థితిలో నేనొకర్ని మోసగించలేను. వారు నాకు కట్టుబడి ఉండనవసరంలేదు. అవివాహితగా – తల్లిని కాలేను.

అతడినించి వెంటనే జవాబు రాలేదు. నేలకేసి చూస్తున్నాడు; పదినిమిషాలు మౌనం; ఆమె తిరిగి ప్రారంభించింది. "మీ శక్తికి మించిన పని ఇది. మీరు నిశ్చింతగా వెళ్ళండి. నేనేమీ అనుకోను. ఉత్తరం చదివినట్లు మర్చిపొండి." గరళాన్ని మింగుతున్నట్లు అంది.

అతడు మౌనంగా పర్స్‌తీసి, తెరచి ఆమెకిచ్చాడు. ఐడెంటిటీ కార్డ్ ఉండవలసిన స్థానంలో నల్గు పంక్తుల చిన్న పద్యం ఆంగ్లంలో రాసుంది. సిట

నాకేమో కొనాలని ఇష్టం లేదండీ!! ఇతే పక్కింటి ఆయారు – నువ్వూ నాలుగువందలు పెట్టి చీర కొనగలవా? – అని సవాలు చేసిందండీ!!

మునిగిపోతున్నవాని ఆర్తనాదం విని ఏ నావికుడైనా ఊరకుంటాడా? వ్యాధిగ్రస్తులు చనిపోతారని తెలిసి ఏ వైద్యుడైనా నిశ్చింతగా ఉంటాడా? బిడ్డలు నాశనమైపోతుంటే చేయూతనిచ్చి నిలపకుండా ఏ తల్లి చూస్తూ ఊరకుంటుంది?

లక్షలకు లక్షలు బాధలు పడ్తుంటే నీవు చూస్తూ విశ్రాంతిగా కూర్చుంటావా? ఆమె అతడికి తిరిగి ఇచ్చివేస్తూ ఆశగా చూచింది "ఇందుకేనా మీరు స్వయంగా వచ్చారు?"

"ఔను. ఒకటి ఆలోచిస్తున్నాను. మీరు కోరినట్లు ఎవరైనా మిమ్మల్ని వివాహం చేసుకుంటారనుకోండి. కానీ వారు మీరు ఇచ్చే తేలికైన అర్థం వివాహాని కివ్వకపోతే? ఆ వ్యక్తి మిమ్మల్ని భార్యగా స్వీకరించి అర్ధాంగిగా గౌరవించి సంసారం చేయదలిస్తే ఏమంటారు?"

మాలతి గాభరాతో చేతులు గట్టిగా నులుముతూ బాధతో మూల్గి అంది, "మరి బిడ్డ! ఆ బిడ్డను అనాథగా వదల్లేను – డాక్టర్ దగ్గర కెళ్ళలేను." ఆనందరావు జాలిగొల్పేచూపుల్ని ఆమెపై కేంద్రీకరించి చూస్తున్నాడు. నిజంగానే 'స్త్రీ' అనే భగవంతుని సృష్టిని చూస్తున్నాడు. తల్లిగా ఆ స్త్రీ పరాకాష్ఠనందుకున్నది. తన సుఖం తృణప్రాయం. తన బిడ్డ ఆమె సర్వస్వం. తల్లి త్యాగశీలతను – ఆమెలోని ఈ ఉదాత్తగుణాలను ఎవరూ చులకనజేసి చూడగలరు? అతడు లాలనగా అన్నాడు, "ఆ బిడ్డ ఏ శరణాలయంలో పెరగనవసరంలేదు. మనదగ్గరే ఉంటుంది."

"మనదగ్గరా?" ఆమె కళ్ళు చక్రాల్లా అయినయ్. పాలిపోయిన పెదిమలు కంపించసాగినై. అంతే, ఒక్కసారి దుఃఖం కట్టలుతెంచుకుంది.

ఆమెదగ్గరగా కుర్చీలాక్కుని కూర్చున్నాడు. అతడి సమీపంలో ఆమె దుఃఖం వెల్లువలై ప్రవహిస్తోంది. అతడు గంభీరంగా కూర్చుని ఆమెకు వ్యవధియిస్తున్నాడు. అతడినించి ప్రసరిస్తున్న అజ్ఞాతశక్తి కిరణాలు ఆమెను తాకి ప్రశాంతపరుస్తున్నాయి. కొంతసేపటికి ఆమె తేరుకుని అశ్రుభరిత నేత్రాలను అతనివైపు మళ్ళించింది. "మీరు ఎక్కడో ఉన్నత శిఖరాలమీద నిర్మలము, పవిత్రము అయిన మందిరం నిర్మించుకుని జీవితాన్ని గడుపుతున్నారు. నాలాటిదానికోసం మీరు మహాస్థానాన్ని ఒదిలి ఈ మలినమైన పాపపంకిలంలోకి దిగిరావటం అవివేకంకాదా ?"

"నన్నొక గొప్పవ్యక్తిగా ఎందుకనుకుంటున్నావు ? నేను నీలాటి మామూలు మనిషిని. అందుకే వస్తున్నాను. ఎక్కడో ఉన్నతస్థాయినించి దిగిరావటం లేదు. మామూలుగానే వస్తున్నాను...మరి నీ కిష్టమేనా ?"

చెంపలకు చేతులాన్చి దీర్ఘాలోచనలో మునిగిపోయింది. తను మళ్ళీ పొరపాటు చేయటంలేదుకదా ? తను రెండవసారి మోసపోసీ ఫరవాలేదు. న్యాయాన్యాయాలను తూచే సమయం కాదిది. మహా జరిగితే ఏం జరుగుతుంది. తనను పరిత్యజిస్తాడు. అంతేకదా ! ఆమె నిశ్చయించుకున్నది. దృఢంగా అంది "నా కిష్టమే. కానీ ఒక షరతు" అతని ముఖంలోకి చూడలేక తల వంచుకుంది. "నువ్వు... నువ్వు షరతు పెడ్తున్నావా అని ఆలోచిస్తున్నారా ? అదేమంత గొప్పది కాదు. ఉద్యోగం మానమన్న ఆంక్ష విధించకండి" ప్రాధేయపడ్తున్న దానిలా అడిగింది.

రెండురోజులు పోయాక వారిద్దరికీ వివాహమైంది. ఆనందరావు ప్రాణస్నేహితుడు - తన లాయరు అయిన గోపీనాథ్ సమక్షంలో పెళ్ళిజేసుకున్నారు. హటాత్తుగా పెళ్ళయిందని చెప్పేసరికి ఆఫీసులో అంతా పార్టీ అని గోలజేశారు. ఎలాగో తప్పించుకున్నది. భర్త పేరు-ఊరు-ఉద్యోగం-ఇత్యాది వివరాలు కనుక్కుని "అదృష్టవంతురాలని" అన్నారు స్నేహితులు.

రెండురోజులు తీరికగా ఇల్లుమార్చి ఆనందరావు గృహానికి వెళ్ళింది. ఆమెను సాదరంగా ఆహ్వానించి తనగదిలోకి తీసుకువెళ్తుంటే మాలతి భయంతో బిగుసుకుపోయింది కానీ గదిచూడగానే హాయిగా ఊపిరించింది. సింగిల్ మంచం, ఒకటే ఒక చెయిర్, డ్రెస్సింగ్ టేబుల్ మాత్రం ఉన్నాయి. ఆమె కృతజ్ఞతతో భర్తవైపుచూచి లోపలికెళ్ళి కొద్దిగా సామాను సర్ది బైటికొచ్చింది.

ఆ రాత్రి మాలతికి చదరంగం ఆటను నేర్పించాడు. ఇద్దరూ కలసి



న్యూస్ విన్నారు. ఆ తరువాత ఓ అరగంట పిచ్చాపాటీ మాట్లాడుకున్నారు. రోజూ ఇలాగే కాలవ్యయంచేసి ఎవరి గదుల్లోకి వారు వెళ్ళిపోయేవారు. మాలతి వంటచేసేది. ఇద్దరూ కూర్చుని తినేవారు. రాత్రుళ్ళు డ్రాయింగ్‌రూం సోఫాలో కూర్చుని తొమ్మిది పదిగంటలవరకు పుస్తకాలు తిరగేసేవారు వేడివేడి బోర్న్‌వీటా అందించి వెళ్ళిపోయేది ఆమెను ఆకర్షించాలని తన కోర్కె వెల్లడి జేయాలని అతడు తాపత్రయపడలేదు. కాలమే ఆమెను మార్చగలదు.

మొదటిరోజు గడియ వేసుకుంటే నవ్వుకున్నాడు. నాల్గురోజులు పోయాక తలుపు జారవేసింది. అంతే. గడియవేసిన శబ్దం అతడికి వినబడనందున దారికొస్తోంది అనుకున్నాడు. వారంరోజులు పోయాక ఆమె తలుపు దగ్గరగా వేయకుండానే నిశ్చింతగా నిద్రపోతోంది. చొరవగా ఎన్నడైనా ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నా ఆమె బిగుసుకుపోయినట్లయ్యేది. అది గ్రహించి ఆనందరావు మెల్లగా ఆమెను విడిచిపెట్టి వెళ్ళిపోయేవాడు. ఆమె వారించకపోయినా హృదయాంతరంలో ఆమె భయపడ్తోందని గ్రహించి జాలిదలచి దూరంగా ఉండేవాడు.

రెండు నెలలు గడిచిపోయాయి మాలతి ఒక నిశ్చయాని కొచ్చింది. ఆ రాత్రి తన భర్తతో చెప్పాలి. పని మానివేయటానికి సిద్ధంగా ఉన్నానని-భోజ

నాలైనై. ఇద్దరూ ముందుగదిలో కూర్చున్నారు. మాలతి వక్కపొడి అందిచ్చింది అతడు వక్కపొడి వేసుకుని చేరబడి కూర్చుని అన్నాడు:

"నాకు శ్రీశైలం ట్రాన్స్‌ఫర్ అయింది. పదిహేను రోజుల్లో జాయినవ్వాలి. మరి నీవేంచేస్తావో నీ యిష్టం" అతడామెను చూడటంలేదు.

మాలతి నవ్వుకుంది. "మీ ఇష్టం. చెప్పండి."

"నా ఇష్టప్రకారం చేస్తావా? ఆజ్ఞ అనుకుని గుడ్డిగా నా వెంబడిరావు కదా!" వ్యంగ్యంగా అన్నాడు.

ఆమె వచ్చి పక్కలో కూర్చుంది. "ఈ రెండు నెలలుగా ఆలోచించాను. రిజైన్ చేయాలనుకుంటున్నాను. మీరేమంటారు?"

"నిజమేనా?" అన్నట్లు ఆమె కళ్ళలోకి తరచి తరచి చూస్తున్నాడు. మాలతి 'ఔను' – అన్నట్లు చూచింది. అతడి చేతినందుకుని గోముగా అంది.

"రిజైన్ చేస్తాను. మనం హాయిగా కలసి వెళ్ళిపోదాం సరేనా?"

ఆమె భుజంమీద చేయివేశాడు. ఈ మాటు ఆమె బిగుసుకుపోలేదు. మెల్లగా దగ్గరకు జరిగింది. దగ్గరగా తీసుకున్నాడు. ఆమె మనఃపూర్వకంగా అతనికి చేరువ అయింది. ఆమె మరి తనగదిలోకి వెళ్ళలేదు.

ఆనందరావు ఒకనాడు పేపర్ చూపించాడు. అది ఒక ప్రకటన. 'అవివాహితులైన స్త్రీలు – ఉద్యోగినులు – ఒంటరి స్త్రీలు జాగ్రత్త' – అన్న ప్రకటన కింద రాజేంద్రలాటి చీడపురుగు సంఘాన్ని తొలిచివేస్తున్నాడని, అతడివల్ల మోసపోకూడదని ఉన్నది. అతడి పద్ధతి – ఎన్ని మార్గాలనుసరించేది కొన్ని ఉదాహరణలు కూడ ఇచ్చారు. వారంరోజులు వరుసగా పత్రికలలో పడింది. ఆనందరావే వేయించాడని మాలతికి తెలియదు.

ఆనందరావుకు కూతురు పుట్టిందని కొలీగ్స్ అంతా వచ్చి అభినందించి వెళ్ళారు. ప్రథమంగా మాలతిని – పొత్తిళ్ళలో పాపను చూడగానే అతడి మనసు ఆనందంతో పరిపూర్తి చెందింది. తన ఇంట్లో ఒక పాప! పాప బుగ్గమీద చూపుడు వ్రేలితో అనురాగంతో రాశాడు. గులాబిరేకుల మృదుత్వానికి పరవశించిపోయాడు. ఒక్కని నల్లని జుత్తును చేతితో రాశాడు గబుక్కున భార్యను చూచి "పాప ఆరోగ్యంగా ఉందికదా? కళ్ళుతెరచిందా?"

మాలతి అనిర్వచనీయమైన ఆనందంతో ఉక్కిరి బిక్కిరైంది. "తన స్వంత పాపలా – అనుభూతి – వారివెంత విశాల హృదయం!" అనుకుంటున్నదల్లా భర్త ప్రశ్నకు చిరుకోపం నటిస్తూ అంది, "అంతేలెండి – నా ఆరోగ్యం

ఎటుబోయినా పరవాలేదు పాప ఆరోగ్యంకోసం ఆరాటం'' అని నవ్వేసి అంది. "పాప ఆరోగ్యంగా ఉందట. కళ్ళుతెరవలేదు. బహుశాః తెరచి – ముందర మిమ్మల్నే చూస్తుంది కాబోలు." ఆమె అంటూనే ఉంది, పాప మెల్లమెల్లగా కళ్ళు తెరుస్తోంది.

"మాలతీ – తెరిచింది... ఈ పచ్చని ప్రపంచాన్ని చూడాలని...''

''కాదు – కాదు – అమృతహృదయులు – ప్రేమమయులైన మిమ్మల్ని చూడాలని'' అంది.

అంతలోకి నర్స్ రావటంతో వారికి మాటలు కరువయ్యాయి. పాప కోసం ఏమేమి సిద్ధంచేయాలో కనుక్కొని వెళ్ళిపోయాడు. పాపకు స్వర్ణలత అని పేరుపెట్టాడు. మాలతి అడ్డుచెప్పలేదు

మూడేళ్ళు కాలగతిలో లీనమయ్యాయి. లత చక్కగా మాట్లాడుతుంది. తండ్రిరాగానే తొడమీద కూర్చుని కబుర్లు చెబుతుంది. కథలు చెప్పించు కుంటుంది. ముగ్గురూ కలసి భోంచేస్తారు. నిద్రపట్టేవరకు తండ్రి పక్కలోనే ఉంటుంది.

పాపలో ఎక్కువ మాలతి పోలికలే. అందుకే రాజేంద్ర ఆమెకు జ్ఞాపకం వచ్చేవాడు కాడు – ఆనందరావుకు ఓ విధమైన సంతృప్తి కల్గింది.

*　　　　*　　　　*

దాదాపు నాలుగేళ్ళ తరువాత రాజేంద్రను చూస్తోంది మాలతి. అతణ్ణి చూడగానే జుగుప్సతో హృదయం నిండిపోయింది. చూచి మాట్లాడితేనే పాపం చుట్టుకుంటుందేమోనన్నంత అసహ్యం వేసింది. అతడితో మాట్లాడనని వ్యతిరేకి స్తోంది మనసు. కానీ తప్పదు. ఈ దృష్టుడి బారినించి తప్పించుకోవాలి అతి సాధారణ దుస్తులతో వచ్చాడు. చేతిలో కాన్వాసుసంచి.

వరండాలోనే నుంచోబెట్టింది. లోపలికి తీసుకువెళ్తే ఆ పవిత్రగృహం మలినమైపోతుందేమోనని భయపడింది.

"లోపలికెళ్దామా ?" లోనకెళ్ళబోతూ అడిగాడు.

''అక్కర్లేదు. నిన్ను ఇక్కడినించే మెడబట్టి గెంటటం సులభం'' ఒక్క మాటుగా నోట్లోనించి ఊసింది

అతడు వికటంగా నవ్వాడు.

''నువ్వంత చౌకబారుగా నవ్వకు. ఇది నీలాంటివారుండే గృహంకాదు."

"సరేలే. నీతో వాదనెందుకు నా ఉత్తరం అందిందా ?''

"ఊఁ."

"నా వ్యాపారం పడిపోయింది. అందుకే డబ్బుకోసం వచ్చాను. సిద్ధంగా ఉంచావా? ఇచ్చేస్తే వెళ్ళిపోతాను."

"డబ్బులేదు. ఇవ్వను" ఖచ్చితంగా అంది.

అతడి కళ్ళు చింతనిప్పుల్లా అయినై. పెదిమలు వికృతంగా ఒంపు తిరిగాయి. "పర్యవసానం ఎలా ఉంటుందో తెలిసే మాట్లాడుతున్నావా?"

"ఔను."

"నీకెంత ధైర్యం! నీ సంసారంలో నిప్పులుపోసి వెళ్తాను. నీ భర్తకు నీ పూర్వచరిత్ర వివరించి నీ వెటువంటిదానవో చెప్పివెళ్తాను. నువ్వు పతితవని - వివాహం కాకుండానే తల్లివైనావని చెప్పివెళ్తాను. మహా పతివ్రతలా ఈ ఇంట్లో తిరుగుతూ నీ భర్తను కొంగున ముడివేసుకున్న జాణవు...గప్‌చిప్‌గా నాల్గువేలు ఇచ్చేసెయ్. వెళ్ళిపోతాను. లేదా..."

"ఆగాగు .." అంటూ ఆనందరావు లోపలినించి వచ్చాడు. అతడు రావటంతో రాజేంద్ర చెదరిపోయి మౌనం దాల్చాడు. ఏదో చెప్పి మాట తప్పిస్తుందేమోనని మాలతి వైపు చూచాడు. మాలతి చిరునవ్వు నవ్వి భర్తతో అంది, "ఈ పురుగును త్వరగా పంపించివేయండి. నేను వెళ్తున్నాను" అంటూ లోపలికెళ్ళిపోయింది.

"ఐతే నువ్వన్నమాట ఆ పురుగువు! ఇదిగో నువ్వు రాసిన ఉత్తరం. నాల్గువేలు కావాలా? నాల్గు పైసలు ఇవ్వను. అందరు నీలాంటి స్వార్థపరులు, దృష్టులు కారు. అంతా తెలుసుకునే పెళ్ళాడాను. ఆమె నన్ను మోసం చెయ్యలేదు. నీ ఉత్తరం అందగానే చింపకుండా నాకిచ్చింది. నీవు ఏ నెపంతో బ్లాక్‌మెయిల్ చేస్తావు? మర్యాదగా వెళ్ళిపో, లేకపోతే పోలీసుల్ని పిలిపిస్తాను... తిరిగి వెళ్ళటానికి డబ్బుందా?" రాజేంద్ర కొరకొరా చూచాడు. గంపెడాశతో వచ్చాడు. కనీసం రెండు వేలైనా దొరికేలా చూడాలనుకుని వచ్చాడు. విధి వక్రించింది. తను బికారిగానె వెళ్ళిపోవాలి. ఇంత అవమానం ఏనాడూ పొందలేదు.

"ఎందుకలా కొరకొర చూస్తావు? నాల్గువేలు అడుక్కుతింటే గొప్పగా ఉంటుంది ఐదు - పది అడుక్కుతింటే నీచంగా ఉంటుందనేనా? నీ ఇష్టం. ఈ పది రూపాయలు ఇక్కడ పెట్టివెళ్తున్నాను. ఇష్టముంటే తీసుకో. కష్ట

ఈ పుస్తకాల్లో విషయాలు
అర్థమైనట్లు - ఆ పుస్తకాల్లో అర్థమై
చావటం లేదురా!!

మైతే మానుకో." మరి ఆలసించకుండా ఆనందరావు లోపలికొచ్చి రాజేంద్ర ముఖంమీద దబ్బున తలుపేసి హాయిగా నవ్వాడు.

ఆ నవ్వు రాజేంద్ర హృదయాన్ని శూలంలా పొడిచింది.

గేటువేసిన చప్పుడు విని ఆనందరావు బైటికొచ్చాడు. "చావలేనివాడై పోయాడు పిరికిపంద - డబ్బు తీసుకెళ్ళాడు మాలతీ" అన్నాడు. అప్పుడే పాప కూడా బైటికొచ్చింది

ముద్దుముద్దుగా "ఎవరు నాన్నా" అని అడిగింది.

"చీడపురుగు లతా" అన్నాడు.

"చీడపురుగు అంటే?" అంది అమాయకంగా.

"చూపిస్తానురా" అని చేయిపట్టుకుని తోటలో నడుస్తూ పూలచెట్లలో ఉన్న పురుగుల్ని చూపుతూ పాఠం చెప్పాడు.

ఆ రాత్రి మాలతి ఎంతో ఉత్సాహంగా ఉంది. హృదయం పూవులా తేలికగా ఉంది. 'నేను గెలిచాను - నేను గెలిచాను' అన్న అహంకారంతో గంతులు వేయాలన్నంత హుషారు పుట్టింది. విజయగర్వంతో నిశ్చింతగ నిద్రపోయింది.

* * *

మాలతి, ఆనందరావు పాపను క్రమశిక్షణలో వుంచుతూ విద్యాబుద్ధులు గరిపారు. ఆంధ్రదేశమంతా ట్రాన్స్‌ఫర్ అవుతూ తిరుగుతూ పాపకు చదువు చెప్పించారు. ఆఖరి రెండు సంవత్సరాలు ఎం.ఏ. చదివినప్పుడు ఆనందరావు రిటైర్ అయి ఉండటంచేత విశాఖపట్నంలోనే స్థిరపడ్డారు.

విద్యావంతులైన తలిదండ్రుల మధ్య పెరిగింది. వయసుకు మించిన తెలివితేటలతో, లోకజ్ఞానంతో అందరి మధ్య అణకువతో మసలుతూ మన్నన లందింది. లతలో ఒకే ఒక లోటు. తండ్రిని చూస్తే చిన్నపిల్లే అయిపోతుంది! ఈ విషయంలో మాలతి కూతుర్ని మందలించేది. కూతురు ఎం ఏ. చదువు తోంది. తెలివిగలది. ఈ ఆనందానికన్నా తన దగ్గర మారాంచేసి అల్లరిచేసి తన చిటికెనవ్రేలిచుట్టూ తనను తిప్పుకున్నప్పటి ఆనందమే ఆనందంగా తలంచి మురిసిపోయేవాడు. ఇక పెళ్ళిచేయాలి అన్న ఆలోచన రాగానే హృదయం విచారంతో ముకుళించుకుపోయేది. తప్పదు. ఏ వయసు కాముచ్చట తీరాలి. కనకై తానే సంబంధాలు చూస్తానన్నప్పుడు మాలతి సంతోషంతో కృతజ్ఞతతో నిండిపోయింది. తను తండ్రికూతుళ్ళ మధ్య ఎప్పుడూ రాలేదు. ఎప్పుడైనా జోక్యం కల్పించుకున్నదంటే అది కూతురి మంకుతనాన్ని చూచి కోప్పడి నప్పుడే.

ఫారిన్‌లో పి.హెచ్‌డి. చేసివచ్చిన తన స్నేహితుడి కొడుక్కి ఇవ్వ టానికి ఏర్పాట్లు జరిగాయి. కాల్‌టెక్స్‌లో ఇంజనీరుగా ఉంటున్నాడు. ఒకరోజు అబ్బాయి తలిదండ్రులు వచ్చి చూచుకుని వెళ్ళారు. ఆ మరుసటి రోజు పాప లేనప్పుడు మరొక మారొచ్చి అన్నీ మాట్లాడుకుని వెళ్ళారు. రవి అధునాతన భావాలుగలవాడు.

లత పరీక్ష వ్రాసివచ్చిన కొన్ని రోజులకే పెళ్ళి నిరాడంబరంగా జరిగింది. ఆ కొత్త ఊళ్ళో ఆనందరావుకి తెలిసినవా ళ్ళెక్కువమంది లేరు. అంతా లత కాలేజీవారు. వరుడి పార్టీవారు. అనవరమైన ఆర్భాటాంకు చెయ్య కుండా తిండి విషయంలో మాత్రం అందర్నీ తృప్తిపర్చారు. వధూవరుల నాశీర్వదించి – ఆనందించి వెళ్ళిపోయారు అతిథులు.

కూతుర్ని అత్తగారింటికి పంపి ఇద్దరు మిలిగిపోయారు. ఆనందరావు ఈ వియోగం భరించలేక కాలుకాలిన పిల్లిలా తిరుగుతుంటే మాలతి హృదయం బాధతో మూల్గేది. రెండుమూడు రోజుల కొకసారి వచ్చి తలిదండ్రులను చూచి వెళ్ళేది. రానురాను వారం పదిరోజుల కొకసారి చూచి వెళ్ళేది. ఆమెలేని 'ఖాళీ' ఇంటికి వారిద్దరు మెల్లమెల్లగా అలవాటవుతున్నారు. ఇంకానయం– కూతురు అదే ఊళ్ళో ఉంది కళ్ళముందే ఉంది. ఫరవాలేదని ధైర్యం చెప్పు కున్నారు.

రెండు సంవత్సరాలు గడిచిపోయాయి. పాలకంటే పాలమీద మీగడ,

అసలుకంటే వడ్డీ మీద ఎక్కువ ఇష్టం అన్నట్లు వారిద్దరికీ, ముఖ్యంగా ఆనంద రావుకు మనమరాలిపైన అత్యంత అపేక్ష. ప్రాణమంతా పాపమీదే పెట్టుకుని జీవిస్తున్నాడు.

అరవై సంవత్సరాల వయసు ఆనందరావు హెర్నియా ఆపరేషన్ అయి వచ్చిననాటినించి ఆరోగ్యం సరిగాలేదు. ఆపరేషన్ సక్సస్‌ఫుల్ అయినా అతడి ఆరోగ్యం రానురాను సన్నగిలుతోంది.

నాల్గురోజులుగా కాస్త లేచి తిరగ్గల్గుతున్నాడు. ఆ వేళ అంతసేపు వరండాలో కూర్చుని సాయంత్రం కాగానే పడుకున్నాడు.

పాప తప్పటడుగులు వేస్తూ "తాత-" అంటుంటే కళ్ళు తెరచి చూచాడు. మాలతి పాపను పక్కలో కూచోబెట్టి తను కుర్చీ దగ్గరకు లాక్కుని కూర్చుంది. పాపతో కాసేపు ముచ్చట్లాడి భార్యవైపు చూచాడు. ఆమె ముఖం గంభీరంగా ఉంది. "అతగాడొచ్చాడు" అంది ముక్తసరిగా.

"ఓ... ఎవరు చెప్పారు ?"

"లత ఫోన్ చేసింది. తీసుకురమ్మన్నాను రవి ఇంకా ఆఫీసునించి రాలేదు. ఇంకొక గంటకు గాని రాడట. రవి లేని సమయంలో చూచి వచ్చాడు."

"మంచిదే. ఫరవాలేదు" అన్నాడు. వారు మరి ఆ విషయం మాట్లాడ లేదు. పాపతో మాట్లాడటానికే సరిపోయింది.

పదిహేను నిమిషాలకు కారాగిన చప్పుడు విని మాలతి లేచింది.

"వెళ్ళొద్దు." అన్నాడు ఆనందరావు.

లత దూసుకుని వచ్చింది. "నాన్నా, ఎలాఉంది ?" అని దగ్గరగా వచ్చి రెండు చేతులతో తండ్రి చెంపలు, నుదురు రాసింది.

గబుక్కున తల్లివైపు తిరిగి "అమ్మా, అటు రా" అంది.

"ఒద్దులే. ఇక్కడే చెప్పు. అతడేమన్నాడేమిటి ? నాన్నగారికి తెలుసు"

"ఏమన్నాడూ ! ఆ స్కౌండ్రల్" క్షమించమన్నట్టు తండ్రిని చూచి-మరీ అంది.

"అతడు నా తండ్రి అట, నిజమేనా ?" అసహ్యం గూడుకట్టింది.

మాలతి హాయిగా నవ్వింది. నవ్వుతూ నవ్వుతుండగనే కళ్ళతో నీళ్ళు తిరిగినై. చెక్కిళ్ళమీదుగ కారిపోతోన్నకన్నీటిని తుడుచుకోటానికి ప్రయత్నించ లేదు. "నాకు తెలీదే లతా. తండ్రి అన్న పదానికి నిర్వచనం నువ్వే ఆలోచిం

చుకో. లేదా రవిని అడుగు. నేను తల్లిని.. ఆగు...... ముందర ఇది చదువు" అంటూ భర్త మంచంకాళ్ళవైపు పరుపు ఎత్తి ఒక కవరు అందించింది. "ఆ గదిలో కెళ్ళి చదువు.''

పాతబడిన గుర్తుగా కాగితం పసుపువన్నె దాల్చింది. మాలతి గబగబ ముందుకొచ్చి ఉత్తరాన్నందుకొని పక్కగదిలో కెళ్ళింది. ఇంతకూ అతడేడీ ? అనుకుంటూ బైటికొచ్చింది. అతడు కార్‌లో దొంగలా కూర్చుని ఉన్నాడు. కాపలాగా వాళ్ళ అల్సేషన్ కుక్క కూర్చుని గుర్ మంటోంది. మాలతికి ఆ గంభీర వాతావరణంలో కూడ నవ్వు వచ్చింది.

అతడు తనను చూడకముందే లోపలికొచ్చేసింది.

లత కాసేపటికి తల్లిదగ్గరకొచ్చింది. ఆమె ముఖం తెల్లగా పాలిపోయి ఉంది. కంపిస్తున్న చేతుల్లో ఉత్తరం రెపరెపలాడుతోంది. హృదయం అవ్యక్తమైన బరువుతో నిండి బ్రద్దలయ్యేలా ఉంది. "ఐతే నిజమేనన్నమాట-అమ్మా" అంది. ఆ మాటలు గొంతులోంచి రావటానికి అవ్యక్తమైన బాధననుభవించింది. రెండు చేతుల్లో ముఖాన్ని కప్పుకుని సోఫాలో కూలబడిపోయింది. మాలతి చూస్తోంది. ఈ ఉత్తరంలోని సారాంశం ఆమె హృదయంలో ఇంకి ఎటువంటి పర్యవసానానికి దారితీస్తుందో ! చూడాలి. తను ఊహించని పరిణామానికి దారితీస్తే తాను భరించగలదా ? ముఖ్యంగా తన భర్త భరించగలడా !

లత పదినిమిషాలు అదో లోకంలో విహరించి చటుక్కున ప్రస్తుతంలోకి వచ్చింది. లోపలికెళ్ళి గ్లాసుడు మంచినీళ్ళు తాగి గబగబ బైటికెళ్తూ అంది, "ఆయనను లోపలికి తెస్తానమ్మా. నీ కిష్టం లేకపోతే వెళ్ళిపో''. మాలతి పక్కగదిలోకి వెళ్ళి భర్తదగ్గర కూచుంది. మెల్లగా పనికుర్రాడికి పాపనప్పగించి పంపించివేసింది. డ్రాయింగ్ రూంలోకి మాటలు స్పష్టంగా విన్పిస్తాయి. ఆ గదికి ఈ గదికి మధ్య స్క్రీన్ మాత్రమే ఉంది.

కుక్కను పిల్చింది. "కమాన్ డైమండ్ - కమాన్" అనగానే అది మొరుగుతూ దగ్గరకువచ్చింది.

"ఇకరావచ్చు" అనగానే రాజేంద్ర హమ్మయ్య అనుకుని దిగివచ్చాడు. లోపలికి తీసుకుని వెళ్ళి కుర్చీ చూపింది

"ఎందుకొచ్చినట్లు ?"

"డబ్బుకోసం"

"ఎంత ?"

"ఐదువేలకు పైన "

"ఇవ్వకపోతే?"

"నీ భర్త రవికుమార్‌కు రహస్యం చెప్పేస్తాను"

"ఏమిటా రహస్యం" వెటకారంగా అంది.

"నేను నీ తండ్రినని."

"ఋజువు."

"ఋజువు కావాలా? నీ తల్లిని సూటిగ ప్రశ్నిస్తే తేలిపోతుంది. లేదా ఆమె భర్త దగ్గరకెళ్ళి అడుగు. నిజం దాచగల శక్తి ఎవరికీ లేదు. 'నేను నీ బిడ్డను కానా? అని అడుగు' చాలు."

"ఐతే నువ్వు నా తండ్రి వన్నమాట." ఆమె విరగబడి నవ్వింది. అ తర్వాత చండికాస్వరూపమే అయింది. క్రోధంతో ముక్కుపుటాలు అదురుతుండే అతడి దగ్గరగా వచ్చింది. "నువ్వు... ఒక మోసగాడివి నా తండ్రివా? నేను పొత్తిళ్ళలో పడుకుని కళ్ళు తెరచినప్పు డెక్కడున్నావు? నేను తప్పటడుగులు వేస్తూ దబ్బున క్రిందపడ్తే ఎత్తుకుని ఎన్నడు లాలించి నా నొప్పికి మంత్రం వేశావు? రాత్రుళ్ళు ఆరుబైట పడుకుని ఆకాశంలోకి చూస్తూ ఆ నక్షత్రాలమాలకట్టి నా మెడలో వేసినట్లే కథలు-కబుర్లు చెప్పి ఏ నాడు నిద్రపుచ్చావు? నా చిన్నకుక్కపిల్ల చనిపోయి నేను ఏడుస్తుంటే ఎప్పుడు ఓదార్చావు? పుట్టుక చావుల మర్మాన్ని నా చిన్నబుద్ధి కర్థమయ్యేలా ఏ రోజు బోధపర్చావు? నా చేయి పట్టుకుని ఆప్యాయంగా ఎప్పుడు 'అఆ'లు దిద్దించి

నా విద్యకు పునాది వేశావు ? ట్రాన్స్‌ఫర్ అయి వెళ్తుంటే స్నేహితులను విడువలేక దుఃఖిస్తుంటే జీవితంలో కలయికలోని ఆనందం - వీడిపోవటంలోని బాధ— ఆ మధురస్మృతులు హృదయాన్ని విశాలపరుస్తాయని వ్యక్తిత్వానికవి మెరుగు పెడ్తాయని ఎప్పుడు చెప్పావు. టైఫాయిడ్ వచ్చి పడుకుంటే నిద్రకాచి నా మంచం దగ్గరే పడకవేసుకుని నా చెయ్యి పట్టుకుని - నా నుదురుతాకుతూ నన్ను కంటికి రెప్పలా ఎప్పుడు చూచావు ? జ్వరం తిరగబెడితే తగ్గేవరకు సెలవుపెట్టి నా మంచం దగ్గర ఎప్పుడున్నావు ? పథ్యం తింటున్న రోజున ఆప్యాయంగా బుజ్జగించి చప్పిడి మెతుకుల్లో మమతనంతా కూర్చి ఏనాడు తినిపించావు ? ముఖమల్ భరిణెలో పెట్టిన వజ్రంలా నన్ను పెంచిన వారు నా తండ్రా - లేక నువ్వా - ఎవరు నువ్వు ! నా జన్మ కారకుడవని చెప్పుకోటానికి సిగ్గు లేదూ ? ఈ రహస్యాన్ని బైటబెట్టి నన్ను నా భర్తనించి దూరం చేయటానికి కూడ సంకల్పించి వెనుదీయని వాడైన నువ్వు ఒక తండ్రివేనా ? తండ్రి అట... తండిరి... ఛీ ఛీ... బజారులో ఆం...బో......"

రవి చటుక్కున లోపలికొస్తూ "లతా ... ఆగు ... ఆ మాటలని చవకై పోకు...ఏమయ్యా...రహస్యం బైటబెడ్తావా ? ఇక్కడ ఏ రహస్యాలు లేవు నాకన్నీ తెలుసు. నీలాంటివాడొక స్పెసిమన్. ఎప్పుడు చూస్తానా అనుకున్నాను. దొరికావు. అసలు నీ కెంత ధైర్యం? సిగ్గువిడిచి వచ్చావు. వెళ్ళిపోతానంటావా సరే — అదా డైమండ్ ఉంది."

రాజేంద్ర చటుక్కున లేచి చేతిరుమాలుతో ముఖం తుడుచుకుంటూ బైటికెళ్తుంటే రవి బిగ్గరగా నవ్వాడు.

"ఎలా వచ్చాడు ?"

"కదల్లేదు. డైమండ్ ఉందిగా బెదిరిస్తే వచ్చాడు."

"భయపడ్డావా?" భార్యను దగ్గరకు తీసుకుంటూ అడిగాడు.

"మీకు తెలుసా?" ఆశ్చర్యంతో అడిగింది.

"ఆ. పెళ్ళికి ముందరే మామయ్య చెప్పారు.

"ఓ" అని విప్పారిన కళ్ళతో భర్తవంక చూచింది.

మరేమనకున్నదో పరుగున తెరతొలగించుకుని ఆనందరావు హృదయం మీద వాలిపోయింది.

"నాన్న...నాన్న" అంటూ తండ్రి భుజాలు తడుముతోంది.

"ఏం లతా?"

"ఇంతకుముందు నువ్వంటే కేవలం ప్రేమే ఉండేది."

"మరి ఇప్పుడు!"

"ఆరాధన కూడా - ఐ లవ్ యు సో మచ్ - మా నాన్న ఎంత మంచివారో" కూతురి వీపును తడుతుంటే ఆయన కళ్ళు చెమ్మగిల్లాయి.

గాద్గదికంగా అన్నాడు "ఈ రోజుకోసం ఎదురుచూస్తూనే భయపడ్డాను.

"ఎందుకని?"

"అతగాడు నీ తండ్రి అని తెలియగానే నీ మనసు మళ్ళుతుందనుకున్నాను"

లత చటుక్కున లేచి తండ్రికళ్ళలోకి చూస్తుంటే కన్నీళ్ళు నిండాయి. "అలా అని ఎలా అనుకుంటావు నాన్నా. నేను నీ లతను కదా" అని మళ్ళీ తండ్రి ఎదమీద తల ఆన్చింది.

"ఔనమ్మా, నువ్వు నా లత పాపవే...ఇది చాలమ్మా. నేను గెలిచాను... గెలుపు నాదే...నా కెంత సంతోషంగా ఉంది!"

ఆ దృశ్యాన్ని చూస్తున్న మాలతి-రవిల హృదయాలు ఆర్ద్రాలయ్యాయి. ఒకరి నొకరు చూచుకున్నారు.

మాలతి అంది, "నేనుగెలిచాను - గెలుపు నాదేనండీ"

"ఉహు, నేనే గెలిచావమ్మా" అంది లత తల లేపకుండానే.

"ఉహు! నాగెలుపుతో సాటి ఎవరిదీలేదు," అంటూ మాలతి చేతిని తన చేతిల్లోకి తీసుకున్నాడు. ముఖం నిండా ఆనందపు వెలుగే. చిరునవ్వు నవ్వుతూ కళ్ళు మూసుకున్నాడు.

గదిలో అంతా నిశ్శబ్దం. కొన్ని క్షణాలకు లత చటుక్కున తలెత్తి అంది "రవీ ...నాన్నగుండె ... నాన్నగుండె ... ఆగిపోయింది"

మాలతి గాభరాగా "ఏమండీ" అని అరుస్తూ ఏడుస్తోంటే రవి గబగబావచ్చి గుండె పరీక్ష చేశాడు. ముక్కుపుటాల దగ్గర అద్దం ఉంచాడు. అద్దం మీద ఊపిరున్న చిహ్నంగా మసకగా లేదు. అద్దం స్వచ్ఛంగా ఉంది!

"ఆ హృదయం ఈ ఆనందానికి తట్టుకోలేకపోయింది" అన్నాడు రవి బిగ్గరగా.

వారి దుఃఖం కట్టలు త్రెంచుకుంది.

హృదయం పగిలిపోతుంటే వెక్కిళ్ళు మధ్య అంది "అతడొచ్చి నాన్నను మనకు దూరంచేశాడు. అతడిదే గెలుపు. మనం ఓడిపోయాం."